సత్యం, సమర్థత, విశ్వసనీయత
WWW.SAKSHYAM.COM
# సాక్ష్యం
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ | సోమవారం 01 జూన్ 2026
సంపుటి: 17 | సంచిక: 154
పేజీలు: 08 | వెల: రూ.2:00
Published from Hyderabad, Vijayawada.

## అమెరికాతో రాజీకి ఇరాన్ ససేమిరా

### హర్మూజ్ యథాస్థితిపై ఐఆర్‌జీసీ సరికొత్త ప్రతిపాదన



అమెరికా–ఇరాన్ మధ్య కొనసాగుతున్న శాంతి చర్చల నేపథ్యంలో ఇరాన్‌కు చెందిన మిలిటెంట్ స్వభావంతో ఉన్న కొన్ని అధికారిక వర్గాలు(హార్డ్‌లైనర్స్) అగ్రరాజ్యంతో ఎలాంటి రాజీకి సిద్ధంగా లేవని ప్రముఖ థింక్‌ట్యాంక్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది స్టడీ ఆఫ్ వార్ క్రిటికల్ థ్రెట్స్ ప్రాజెక్ట్ విశ్లేషించింది. ముఖ్యంగా ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ కు చెందిన ఉన్నతాధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గేందుకు సిద్ధంగా

మిగతా 2 లో..



## సీడీఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజా సుబ్రమణి

భారత నూతన చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్)గా జనరల్ ఎన్.ఎస్. రాజా సుబ్రమణి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. జనరల్ అనిల్ చౌహాన్ పదవీకాలం మే 30న ముగిసిన నేపథ్యంలో ఆయన స్థానంలో రాజా సుబ్రమణి నియమితులయ్యారు.


మిగతా 2 లో..



## మళ్లీ పెరిగిన కమర్షియల్ సిలిండర్ ధర

కొత్త నెల తొలి రోజులనే ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు 19 కిలోల కమర్షియల్ సిలిండర్ల ధరలను పెంచాయి. నేటి (జూన్ 1) నుంచి దేశవ్యాప్తంగా కమర్షియల్ ఎల్‌పీజీ

మిగతా 2 లో..



## ఉత్తరాఖండ్‌లో కురుస్తున్న భారీ వర్షాలు

**కేదార్‌నాథ్ దర్శనం తాత్కాలికంగా నిలిపివేత**

ఉత్తరాఖండ్‌లోని రుద్రప్రయాగ్ జిల్లాలో శనివారం రాత్రి నుంచి కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలు, వాతావరణ శాఖ జారీ చేసిన ఆరెంజ్ అలర్ట్ కారణంగా, కేదార్‌నాథ్ యాత్రను తాత్కాలికంగా

మిగతా 2 లో..






# అదరహో ఆర్సీబీ..

ఐపీఎల్ 2026 విజేతగా ఆర్సీబీ..

అద్వితీయమైన ప్రదర్శనతో టైటిల్ సొంతం

వరుసగా రెండో టైటిల్‌ను ముద్దాడిన బెంగళూరు

5 వికెట్ల తేడాతో గుజరాత్ టైటాన్స్‌పై గెలుపు

8 లో

**డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చెలెంజర్స్ బెంగళూరు అద్భుతం చేసింది. బ్యాక్ టూ బ్యాక్ టైటిళ్లతో దిగ్గజ టీమ్ ల సరసన నిలిచింది. ఆదివారం అహ్మదాబాద్ లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన మ్యాచ్ లో ఆతిథ్య గుజరాత్ టైటాన్స్ పై 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. అంతకుముందు ఫైనల్లో టాస్ గెలిచి, ప్రత్యర్థిని బ్యాటింగ్ కు ఆహ్వానించి, తక్కువ స్కోరుకే పరిమితం చేసింది.**

## ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి

### కీలక తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టు

### ఆగస్టు 31 వరకు గడువు పొడిగింపు



టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ను విధుల్లో ఉన్న ఉపాధ్యాయులకు తప్పనిసరి చేస్తూ గతంలో ఇచ్చిన తీర్పుపై దాఖలైన సమీక్ష పిటిషన్లను సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది. అయితే టెట్ అర్హత సాధించేందుకు ఉపాధ్యాయులకు ఇచ్చిన గడువును 2028 ఆగస్టు 31 వరకు పొడిగించింది. న్యాయమూర్తులు జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. పిల్లలకు నాణ్యమైన విద్య అందించడం రాజ్యాంగబద్ధమైన హక్కు అని,

మిగతా 3 లో..

### జూన్ 16 నుండి టెట్

**టెట్ పరీక్షల షెడ్యూల్ విడుదల!**

తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష రాసే అభ్యర్థులకు విద్యాశాఖ కీలక అప్‌డేట్ ఇచ్చింది. టెట్ ఆన్‌లైన్ పరీక్షల పూర్తి షెడ్యూల్‌ను ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్, టెట్ కన్వీనర్ ఆదివారం విడుదల చేశారు. మొత్తం 10 సెషన్లలో, 5 రోజుల పాటు ఆన్‌లైన్ పద్ధతిలో ఈ పరీక్షలు జరగనున్నాయి. జూన్ 16, 2026 నుండి జూన్ 22, 2026 మధ్య ఈ ఎగ్జామ్స్ నిర్వహించనున్నారు. ప్రతిరోజు రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరుగుతాయి. మొదటి సెషన్ ఉదయం 9:00 గంటల నుండి ఉదయం 11:30 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2:00 గంటల నుండి సాయంత్రం 4:30 గంటల వరకు జరగనున్నాయి.జూన్ 16, 2026: షిఫ్ట్ 1 లో పేపర్–1

మిగతా 3 లో..

### మూడో డిస్కమ్ రైతులపాలిట

# శాపం

- సాగు, తాగునీటి ప్రాజెక్టులకు కోతలే
- ఉచిత విద్యుత్ ఇస్తేనే ఓట్లు అడుగు
- సీఎం రేవంత్‌రెడ్డి ప్రమాణం చేయాలి
- మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్



మూడో డిస్కమ్ రైతులపాలిట శాపం గా మారనున్నది.. ఈ డిస్కమ్ వల్ల సాగు, తాగునీటి ప్రాజెక్టులకు కరెంట్ కోతలు తప్ప వు. దమ్ముంటే రైతులకు 24గంటల ఉచిత విద్యుత్ ఇస్తేనే వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడుగుతానని సీఎం రేవంత్‌రెడ్డి ప్రమాణం చేయాలి' అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు చాలెంజ్ చేశారు. పగలు మాత్రమే ఉండే సోలార్ పవర్‌తో 24గంటల కరెంట్ ఎలా ఇస్తారో రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 24గంటల ఉచి త కరెంట్ కోసమే కొత్త డిస్కమ్ ఏర్పాటు చేస్తున్నామని నిన్న ముఖ్యమంత్రి చెప్పడం పచ్చి అబద్ధం అని మండిపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో రైతులకు రోజుకు 13గంటలకు మించి కరెంట్ ఇవ్వడం లేదని, రైతు డిస్కమ్ ఏర్పాటుతో 7–8గంటలే ఇచ్చేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు.గుజరాత్‌లో 7గంటలు, కర్ణాటకలో 8గంటల మాత్రమే వస్తున్న బడే భాయ్ మోదీ విధానాలను అమ లు

మిగతా 2 లో..



## లక్ష ఇండ్లకు సామూహిక

# గృహప్రవేశాలు..

### నేడు ఆసిఫాబాద్ జిల్లాలో ప్రారంభించనున్న సీఎం

- రూ.112.14 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- సీఎం పర్యటన సందర్భంగా భద్రతా నిర్వహణ
- జిల్లాలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సోమవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాలో చేపట్టనున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. మొత్తం రూ.112.14 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టనున్నారు. ఈ పర్యటనలో భాగంగా చింతలమానేపల్లి మండలంలోని కౌటాల (రవీంద్రనగర్ క్యాంపు నం–2) గ్రామంలో ఏర్పాటు చేయనున్న 132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణ పనులకు రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.56.55 కోట్లు. రెబ్బెన మండలం నాంబాల్ గ్రామంలో రూ.6 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న సౌర విద్యుత్ ప్లాంట్ పనులకు కూడా సీఎం శంకుస్థాపన

మిగతా 2 లో..

### ఖర్గేతో టీపీసీసీ చీఫ్, సీఎం భేటీ..

**ఎస్ఐఆర్, మంత్రివర్గ విస్తరణపై చర్చ**

హైదరాబాద్ మీదుగా గుల్బర్గాకు వెళ్తున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదివారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కాసేపు ఆగారు. టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్‌రావు, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ఖర్గేను కలిశారు. తెలంగాణలో రాజకీయాలు, పార్టీ పరిస్థితి, ఎస్ఐఆర్ సహా పలు కీలక అంశాలపై చర్చించినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీ క్యాడర్ బలోపేతం, ప్రభుత్వం–పార్టీ మధ్య సమన్వయం, క్యాబినెట్ విస్తరణ, మంత్రుల శాఖల్లో మార్పుపై చర్చించినట్టు తెలిసింది.

### నేటి నుంచి కనీస వేతనాలు అమలు

**తెలంగాణ కార్మిక శాఖ ఉత్తర్వులు జారీ**

తెలంగాణలో పని చేస్తున్న 1.11 కోట్ల మంది కార్మిక, వేతన జీవుల సమాజానికి నేటి నుంచి కనీస వేతనాలు పెరగనున్నాయి. ఈ మేరకు తెలంగాణ కార్మిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కనీస వేతనాల చట్టం పరిధిలోకి కొత్తగా పది రంగాలను చేర్చడంతో మొత్తం ఉపాధి రంగాల సంఖ్య 77కు పెరిగింది. వివిధ రంగాలకు, వేర్వేరు వేతనాలు కాకుండా అందరికీ ఒకే విధమైన వేతనాల కోసం ప్రభుత్వం ఏకీకృత నమూనా ప్రవేశ పెట్టింది. ఈ కొత్త ఉత్తర్వులతో కార్మికులకు భారీగా

మిగతా 3 లో..

## నేడు జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాలు

దేశంలోని ప్రఖ్యాత ఐఐటీల్లో సీట్ల భర్తీకి నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ 2026 ఫలితాలు సోమవారం (జూన్ 1) విడుదల కానున్నాయి. ఈ మేరకు ఐఐటీ రూర్కీ ప్రకటన వెలువరించింది. సోమవారం ఉదయం 10 గంటలకు అధికారిక వెబ్‌సైట్‌లో స్కోర్‌కార్డులు, ఆలిండియా ర్యాంకులను విడుదల చేస్తారు. డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ ఏడాది దేశ వ్యాప్తంగా మొత్తం లక్ష 80 వేల మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాశారు. వీరికి 17న పలు పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించారు. అయితే ఇందులో ఈసారి 45 వేల వరకు విద్యార్థులు అర్హత సాధించే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ క్వశ్చన్ పేపర్ కఠినంగా వచ్చినందున ఈసారి కటాఫ్ కూడా భారీగా తగ్గే అవకాశం ఉందని జ్యోష్యం చెబుతున్నారు. గతేడాది (2025)లో కౌన్సెలింగ్ అర్హత కోసం కటాఫ్ మొత్తం 360 మార్కులకుగానూ 74గా నిర్ణయించారు. అయితే ఈ ఏడాది పరీక్ష మరింత

మిగతా 3 లో..

## తెలంగాణలో ఎండల తీవ్రత

### రికార్డు స్థాయిలో పగటి ఉష్ణోగ్రతలు

### వడదెబ్బతో అల్లాడిపోతున్న ప్రజలు

### పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ



తెలంగాణలో ఎండల తీవ్రత ఇంకా కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతుండటంతో ప్రజలు వడదెబ్బతో అల్లాడిపోతున్నారు. ఈ తీవ్రమైన వడగాల్పులు వీస్తున్న క్రమంలో హైదరాబాద్ వాతావరణ కేంద్రం తాజాగా రాష్ట్రంలోని పలు జిల్లాలకు అత్యంత కీలకమైన రెడ్ అలర్ట్ జారీ చేసింది. ముఖ్యంగా మహబూబాబాద్,

మిగతా 3 లో..

# సంపాదకీయం

## ద్రవిడ పార్టీల మనుగడ కష్టమే

తమిళనాడు రాజకీయాలు రసవత్తర మలుపులు తిరుగుతున్నాయి. మద్దతుల ఇచ్చిన అన్నా డిఎంకె ఎమ్మెల్యేలు మళ్లీ పళనిస్వామి చెంతకు చేరారు. మేమంతా మీ వెంటే అని ప్రకటించారు. ఈ ప్రభుత్వం ఎక్కువ కాలం మనలేదని డిఎంకె నేత స్టాలిన్ ఇప్పటికే శాపనార్థాలు పెట్టారు. ఈ స్థితిలో కాంగ్రెస, లెఫ్, ముస్లిం పార్టీల మద్దతు బొటాబొటిగా ఉంది. దీంతో మరో ఐదేళ్లపాటు లాక్కురావడం అంత సులభం కాదు. ఎందుకంటే ఐదారు సీట్ల మద్దతుతో వారి గొంతెమ్మ కోర్కెలు తీర్చడం సిఎం విజయ్‌కు తలనొప్పిగా పరిణమించవచ్చు. ఈ క్రమంలో సొంతగా బలం కోసం టివికె అధినేత, సిఎం కొత్త ఎత్తులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ద్రవిడ పార్టీలకు చెక్ పెట్టడంతో పాటు తమిళనాట పాతుకు పోయేందుకు రాజకీయంగా ఎత్తులు వేస్తున్నట్లు పరిస్థితులు తెలియచేస్తున్నాయి. చిల్లర పార్టీలతో కలిసి నడిచేకంటే సొంతగా బలం సమకూర్చుకోవడం ఉత్తమమని ఆయన భావనలో ఉన్నారు. అందుకే ఇటీవల అన్నాడిఎంకెకు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు రాజీనామా చేసి విజయ్ పంచన చేరారు. వారు ఉప ఎన్నికల్లో టివికె పార్టీ పక్షాన గెలిస్తే సొంతబలం పెరగవచ్చు. ఇలా సొంత బలం కోసం అవసరమైన ఇతర పార్టీల్లోని ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి గెలిపించుకోవాలన్న ఎత్తుగడలో సిఎం విజయ ఉన్నట్లు సమాచారం. ఓవైపు ప్రజాసంక్షేమ కార్యక్రమాలు చేస్తూ ప్రజల్లో అభిమానం పెంచుకోవడంతో పాటు, పార్టీ బలాన్ని పెంచుకునేలా టివికె చీఫ్ ఎత్తుడగులు సాగుతున్నాయి. అధికారంలో ఉంది మన ప్రభుత్వమే అని డీఎంకే అధినేత ఎం.కె.స్టాలిన్ పార్టీ కార్యకర్తలతో అన్నట్లు విస్తృత ప్రచారంలో ఉంది. మరో సందర్భంలో విజయ్ ప్రభుత్వం కూలిపోయేందుకు సిద్ధంగా ఉందని ఆయనే వెల్లడించారు. ఈ మాటల్ని అనుసరించి.. టీవీకే ప్రభుత్వాన్ని తాను నియంత్రించేస్థాయిలో ఉన్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇది టీవీకేకు మింగుడు పడటంలేదు. మరోవైపు అన్నాడీఎంకే చీలికల కారణంగా మద్దతుగా నిలిచిన 25 మందిలో కొందరు మంత్రి పదవుల్ని ఆశించినట్లు ప్రచారంలో ఉంది. మంత్రివర్గ విస్తరణలో వారికెలాంటి స్థానం లేకపోవడం, కాంగ్రెస్ లో ఇద్దరికి దక్కడంతో పాటు డీఎంకే కూటమిలోని ఐయూఎంఎల్, వీసీకేకు చెరొక మంత్రిపదవి ఇవ్వడంతో అన్నాడీఎంకే చీలిక శ్రేణులు అసంతృప్తిగా ఉన్నట్లు తేలింది. డీఎంకే అధిపత్యం తగ్గించే వ్యూహంలో.. అన్నాడీఎంకే చీలిక ఎమ్మెల్యేలు తమవైపు ఉండటాన్ని లాభంగా మలచుకోవాలని టీవీకే చూస్తోంది. తమ పార్టీలోకి రావాలంటే రాజీనామాలు చేయాలనే షరతు విధించినట్లు విశ్వసనీయంగా చెబుతున్నారు. ఇందులో భాగంగానే నలుగురు రాజీనామా చేసి టీవీకేలో చేరారు. రాజీనామాలు చేసేందుకు మరికొందరు అన్నాడీఎంకే చీలికవర్గం ఎమ్మెల్యేలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. టీవీకేకు అసెంబ్లీ ఎన్నికల్లో మ్యాజిక్ ఫిగర్ రాకపోవడంతో.. ఆ పార్టీకి మద్దతిచ్చే పక్రియలో రెండు ప్రధాన కూటములు ఎవరి ఆట వారు ఆడుతున్నట్లు కనిపిస్తోంది. ఇప్పుడు విజయ్ కొత్త ఆట మొదలుపెట్టారు. పలువురు ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించి విజిల్ గుర్తుపై బరిలోకి పంపి.. వారిని గెలిపించి.. ఇతర పార్టీల మద్దతు లేని సొంత ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇటీవల అసెంబ్లీలో జరిగిన బల ప్రదర్శనలో టీవీకే ప్రభుత్వం అనూహ్య మద్దతు కూడగట్టుకుంది. ఏకంగా 144 ఎమ్మెల్యేల బలాన్ని అందుకుంది. ఈ సంఖ్యలోనే అనేక వ్యూహాలు కనిపిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. టీవీకేపై ఆధిపత్యం కోసం ఇటు డీఎంకే కూటమి, అటు అన్నాడీఎంకే ఓ వర్గం అంతర్గత వ్యూహాల్ని రచించినట్లు తెలుస్తోందంటున్నారు. అంతర్గత నిర్ణయాల కారణంగా తమ కూటమిలోని వీసీకే, ఐయూఎంఎల్, సీపీఐ, సీపీఎం పార్టీలకు చెందిన 8 సీట్లను టీవీకే మద్దతుగా ఇచ్చారు. మరోవైపు టీవీకేతో జట్టుకట్టిన కాంగ్రెస్‌కు 5 సీట్లు, ఏఎంఎంకే నుంచి బయటికి వచ్చి స్వతంత్ర అభ్యర్థిగా మద్దతిచ్చిన కామరాజ్ ఓటు కలిపి.. టీవీకేకు 119 సీట్ల వచ్చింది. కోర్టు ఆంక్షలతో తిరపత్తూర్ ఎమ్మెల్యే ఓటింగ్‌కు పాల్గొనలేదు, తిరుచ్చి తూర్పుస్థానం ఖాళీగా ఉండటం, స్పీకర్ ఓటు లెక్కలోకి లేకపోవడంతో టీవీకే బలం 105గా ఉంది. ఇతరుల మద్దతుతో ఓటింగ్‌కు ముందే మ్యాజిక్ ఫిగర్ దాటినట్లు అంచనాలు వచ్చాయి. ఇక అసెంబ్లీలో ఓటింగ్ జరుగుతున్న క్రమంలో అన్నాడీఎంకే చీలికవర్గం నుంచి అనూహ్యంగా మరో 25 ఓట్లు దక్కాయి. దీంతో బలం 144కు చేరింది. రెండు కూటముల నుంచి టీవీకేకు బలం అందడంతో వచ్చే 6నెలలదాకా ప్రభుత్వం కూలడానికి ఉన్న అడ్డంకులన్నీ తొలగిన్లట్లైంది. మద్దతు పార్టీల సంగతి అటుంచితే.. ఇప్పటికిప్పుడు టీవీకే నెమ్మదిగా బలపడుతోంది. సొంతంగా 107 స్థానాలు దగ్గరున్నాయి. 5 కాంగ్రెస్, ఒక స్వతంత్రతో పాటు ప్రస్తుతం ఖాళీగా ఉన్న 5 అసెంబ్లీ స్థానాల్లో గెలిస్తే.. 118 స్థానాల బలమొస్తుంది. అన్నాడీఎంకే చీలిక వర్గంలోని మరికొందరు రాజీనామాలకు సిద్ధపడి టీవీకే గుర్తుపై పోటీ చేసే అవకాశమొస్తే మ్యాజిక్ ఫిగర్ 118ని దాటి స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే అవకాశముందని రాజకీయ విశ్లేషకుల్లో చర్చ సాగుతోంది. తిరుచ్చి ఈస్ట్‌లో విజయ్‌కు 91,381 ఓట్లు వచ్చాయి. ఈయన డీఎంకేపై 27,416 ఓట్లతో గెలిచారు. ఇక్కడ అన్నాడీఎంకే చీలికవర్గ బలం తోడైతే అవలీలగా లక్ష ఓట్లు దాటొచ్చనేది అంచనా. రాజీనామాలు చేసిన స్థానాల్లో.. చెంగల్పట్టు జిల్లా మదురాంతకం(ఎస్సీ), తిరునెల్వేలి జిల్లా అంబాసముద్రం కలుపుకుని ఇప్పుడు తొలి 3 స్థానాల పార్టీలు టీవీకేవైపు ఉండటంతో ఇక్కడ లక్షన్నర ఓట్లకు తగ్గని బలముంది. 4 రాజీనామా స్థానాల్లో తిరిగి టీవీకే అభ్యర్థి గెలిచే అవకాశాలు సమృద్ధిగా ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ఇలా మరిన్ని స్థానాలు విజయ్‌కి తోడై అవలీలగా, ఒంటరిగా టీవీకే ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, తద్వారా డీఎంకే ప్రభావాన్ని లేకుండా చేయడంతో పాటు స్వేచ్ఛగా పాలన అందించే దిశగా అడుగులు వేసే అవకాశాన్ని టీవీకే పరిశీలిస్తోంది. ఈ సమీకరణాలతో విజయ్ రాష్ట్రంలో మరింత బలపడాలని చూస్తున్నారు. అదే జరిగితే ద్రవిడ పార్టీలకు మనుగడ కష్టమే.

## సీడీఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజా సుబ్రమణి

మొదటిపేజీ తరువాయి..

బాధ్యతల స్వీకరణ సందర్భంగా దిల్లీలోని సౌత్ బ్లాక్ లాన్స్‌లో జనరల్ రాజా సుబ్రమణికి త్రివిద దళాలు గౌరవ వందనాన్ని సమర్పించాయి. అనంతరం దేశ రాజధానిలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. పాకిస్థాన్, చైనా వ్యవహారాల్లో నిపుణుడిగా గుర్తింపు పొందిన సుబ్రమణి, నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటేరియట్(ఎన్ఎస్‌సీఎస్)లో సైనిక సలహాదారుగా సేవలు అందించారు. గతేడాది జులై 31న వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా ఆయన పదవీ విరమణ చేశారు. సీడీఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సుబ్రమణి మీడియాతో మాట్లాడారు. సైనిక దళాల బలోపేతం, త్రివిధ దళాల మధ్య సమన్వయం, ఏకీకరణకు సంస్థాగతంగా సంస్కరణలు తేవడమే తన లక్ష్యమని ఆయన స్పష్టంచేశారు. దేశ సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను పరిరక్షించడానికి కట్టుబడి ఉన్నామని వెల్లడించారు. సాయుధ దళాలు అంకితభావం, ధైర్యం, వృత్తి నైపుణ్యంతో దేశానికి సేవ చేయడం కొనసాగిస్తాయని, ఈ మేరకు దేశ ప్రజలకు హామీ ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# లక్ష ఇండ్లకు సామూహిక గృహప్రవేశాలు..

మొదటిపేజీ తరువాయి..

చేయనున్నారు. నారాయణపేటలో ప్రారంభమైన ఇందిరమ్మ ఇళ్ల పథకం తొలివిడతలో ఒక్కో ఇంటికి రూ.5 లక్షల సాయంతో 3,68,540 ఇళ్లు కేటాయించగా, 1,09,682 ఇళ్లు పూర్తయ్యాయి. వీటి గృహప్రవేశాలు, రెండో విడత ఇళ్ల ప్రకటన కోసం రేవంత్‌రెడ్డి సోమవారం సాయంత్రం 5:45 గంటలకు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కొరారి గ్రామంలోని గృహప్రవేశాల కార్యక్రమంలో పాల్గొంటారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవానికి పైలాన్ ఆవిష్కరించనున్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో ముఖాముఖి సమావేశం నిర్వహిస్తారు.

అనంతరం కాగజ్‌నగర్ సభ నుండి రెండో విడత గృహ నిర్మాణ ప్రక్రియను ఆయన అధికారికంగా ప్రారంభిస్తారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ నివాసం నుంచి రాత్రి 10 గంటలకు బయలుదేరి హైదరాబాద్ కు రానున్నారు. అదే విధంగా చింతలమానేపల్లి, గుడ్లబోరి, కాపువాడ, చింతకుంట, అంకుషాపూర్ ప్రాంతాల్లో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాల పనులకు కూడా ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టనున్నారు. ఈ ఉపకేంద్రాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మరింత బలోపేతం కావడంతో పాటు వ్యవసాయం, పరిశ్రమలు, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందుబాటులోకి రానుంది. జిల్లాలోని ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో రూ.15 కోట్లతో చేపట్టనున్న తొమ్మిది అభివృద్ధి పనులు, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో రూ.18.70 కోట్లతో చేపట్టనున్న ఎనిమిది అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా జిల్లాలో విద్యుత్ మౌలిక సదుపాయాల విస్తరణ, పునరుత్పాదక ఇంధన వినియోగ ప్రోత్సాహం, పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి జూపల్లి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా ఏర్పాట్లు పూర్తయ్యాయని చెప్పారు. ఆసిఫాబాద్ జిల్లాలో సోమవారం సీఎం రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సజావుగా, ప్రశాంతంగా జరిగేందుకు సభా స్థలం, పార్కింగ్ ప్రదేశాలు, వీఐపీ ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలు, హెలిప్యాడ్ ప్రాంతం, ట్రాఫిక్ మార్గాలు తదితర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. సీఎం రేవంత్ పర్యటన సందర్భంగా భద్రతా నిర్వహణ కోసం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బందోబస్తులో ఇద్దరు అదనపు ఎస్పీలు, 11 మంది డీఎస్పీలు, 44 మంది సీఐలు/ఆర్‌ఐలు, 157 మంది ఎస్‌ఐలు/ ఆర్ఎస్‌ఐలు/ డబ్ల్యూఎస్‌ఐలు, 200 మంది ఏఎస్‌ఐలు/హెడ్ కానిస్టేబుళ్లు, 829 మంది పోలీసు కానిస్టేబుళ్లు, 43 మంది మహిళా పోలీసు సిబ్బంది, 328 మంది హోంగార్డులు విధుల్లో పాల్గొనున్నారు. అదనంగా 9 ప్రత్యేక పార్టీలు, 2 రోప్ పార్టీలు, 28 యాక్సెస్ కంట్రోల్ బృందాలు, 10 బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ బృందాలను మోహరించినట్లు తెలిపారు. మొత్తం 1,825 మంది పోలీసు అధికారులు, సిబ్బంది సీఎం రేవంత్ రెడ్డి పర్యటన భద్రతా ఏర్పాట్లలో పాల్గొంటారని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరించి, ట్రాఫిక్, భద్రతా నియమాలను పాటించాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ విజ్ఞప్తి చేశారు.

## మూడో డిస్కమ్ రైతులపాలిట శాపం

మొదటిపేజీ తరువాయి..

చేసేందుకు చోటా భాయ్ యత్నిస్తున్నారని విమర్శించారు. రైతు డిస్కమ్‌లో సౌర విద్యుత్ మాత్రమే ఇస్తామని జీవో నెంబర్ 8లో పేర్కొన్నారని.. ఆ విద్యుత్తుతో ఎత్తిపోతల ప్రాజెక్టుల మోటర్లు ఎలా నడుస్తాయని ప్రశ్నించారు. ఆర్పీడీసీఎల్ ఏర్పాటును వెంటనే రద్దు చేసి, రైతులకు 24గంటల కరెంట్ ఇవ్వకపోతే బీఆర్ఎస్ పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం సిద్దిపేట జిల్లాకేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయంలో హరీశ్‌రావు మీడియా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర విద్యుత్తురంగ భవిష్యత్తుపై ఆయన పలు కీలక అంశాలతో పాటు సాక్ష్యాలను వెల్లడించారు. హరీశ్‌రావు మాట్లాడుతూ ఆర్పీడీసీఎల్ ఏర్పాటుతో లిఫ్ట్ ఇరిగేషన్, మిషన్ భగీరథ ప్రాజెక్టులకు కరెంట్ కష్టాలు తప్పవని తేల్చిచెప్పారు. ఆర్పీడీసీఎల్ తో రైతులకు ఉచిత విద్యుత్ రాకపోగా, అది వ్యవసాయరంగానికి ఉరితాడుగా మారబోతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈఆర్సీ ముందు జరిగిన బహిరంగ విచారణలో కాంగ్రెస్ అధికారికంగా రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి ద్వారా రైతాంగానికి 3గంటల కరెంట్ చాలు అని చెప్పించిందని, గతంలో రేవంత్ అదే మాట అన్నారని గుర్తుచేశారు. కొత్త డిస్కమ్ ఏర్పాటుచేయాలనే ప్రభు త్వం నిర్ణయం వల్ల రాష్ట్రంలోని కాళేశ్వరం, దేవాదుల, నెట్టెంపాడు, కల్వకుర్తి, భీమా, కోయిల్ సాగర్, సీతమ్మసాగర్ లాంటి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులన్నీ ప్రమాదంలో పడుతాయని హరీశ్‌రావు తేల్చిచెప్పారు. ఎలక్ట్రిసిటీ యాక్ట్–2003 ప్రకారం ఎవరికైనా కనెక్షన్ ఇవ్వాలని హరీశ్‌రావు చెప్పారు. కానీ ఆర్పీడీసీఎల్ వల్ల ఒకేచోట రెండు లైన్లు, రెండు స్తంభాలు వేయాల్సి వచ్చి రైతుల భూములు దెబ్బతినడమే గాక, ప్రజాధనం వృథా అవుతుందని.. ఇదొక తుగ్లక్ చర్య అని విరుచుకుపడ్డారు. ముంబై, బెంగళూరు మాదిరిగా లాభాలు వచ్చే




డిసమ్‌లను ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టి, ఉచిత కరెంటును పకన పెట్టే కుట్రలో భాగంగానే రేవంత్ ఈ మూడో డిసమ్‌ను తెరపైకి తెచ్చారని మండిపడ్డారు. తక్షణమే అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి డిస్కమ్‌లపై చర్చించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వల్లే డిసమ్ అప్పుల పాలైందని ముఖ్యమంత్రి మాట్లాడటం ఆయన అవగాహనారాహిత్యానికి నిదర్శనమని మండిపడ్డారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో డిసమ్‌లకు ప్రభుత్వం రూ.27వేల కోట్లు బకాయి పడితే, కాంగ్రెస్ పాలనలో రెండేండ్లలోనే రూ.25,284 కోట్లు బకాయి పడిందని తెలిపారు. అంటే ఏడాదికి 10వేల కోట్లు అప్పులపాలు చేశారని మాజీ మంత్రి హరీశ్‌రావు నిప్పులుచెరిగారు.

## అమెరికాతో రాజీకి ఇరాన్ ససేమిరా

మొదటిపేజీ తరువాయి..

లేరని స్పష్టం చేసింది. ఎలాంటి రాయితీలు ఇవ్వడానికి ఐఆర్‌జీసీ ఆసక్తి చూపడం లేదని నివేదిక పేర్కొంది. ఐఎస్‌డబ్ల్యూ–సీటీపీ ప్రకారం, హర్మూజ్ జలసంధి గుండా జరిగే సముద్ర రవాణాపై ఆధిపత్యాన్ని చూపించేందుకు ఐఆర్‌జీసీ కొత్త యథాతథ స్థితిని ప్రతిపాదించేందుకు ఇరాన్ ప్రయత్నిస్తోంది. ఆ విధానాన్ని అమెరికాతో పాటు అంతర్జాతీయ సమాజం తిరస్కరించాలని నివేదిక సూచించింది. అంతర్జాతీయ జలాల్లో నావిగేషన్ స్వేచ్ఛకు ఇది ప్రమాదకరమైన ఉదాహరణగా మారుతుందని హెచ్చరించింది. నివేదికలో మరో కీలక అంశంగా ఇరాన్‌లోని హార్డ్‌లైన్ వర్గం ఏకరూపంగా లేదని, అందులో విభిన్న అభిప్రాయాలు, ప్రాధాన్యతలు కలిగిన వర్గాలు ఉన్నాయని పేర్కొంది. అయితే ఐఆర్‌జీసీ కమాండర్ మేజర్ జనరల్ అహ్మద్ వాహిదీతో పాటు ఆయనకు సన్నిహితంగా ఉన్న నాయకత్వ వర్గం అమెరికాతో చర్చల్లో రాజీకి సిద్ధంగా లేదని స్పష్టం చేసింది. అదే సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌తో శాంతి ఒప్పందం కుదిరే అవకాశాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన, చర్చలు విఫలమైతే సైనిక చర్య కూడా ఒక ప్రత్యామ్నాయమని స్పష్టం చేశారు. అయితే ఎలాంటి ఒప్పందమైనా ఇరాన్ అణ్వాయుధాలు అభివృద్ధి చేయదన్న స్పష్టమైన హామీపై ఆధారపడి ఉండాలని చెప్పారు. “మేము ఒక మంచి ఒప్పందం వైపు వెళ్తున్నాం. అది సాధ్యం కాకపోతే ఇతర మార్గాలను పరిశీలిస్తాం. కానీ అణ్వాయుధాలు ఉండకూడదన్న హామీ మాత్రం తప్పనిసరి” అని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని ఇప్పటికే బలహీనపరిచామని ఆయన వ్యాఖ్యానించారు. ఒప్పందం కుదిరితే హర్మూజ్ జలసంధి వెంటనే తెరుచుకునే అవకాశం ఉంటుందని కూడా చెప్పారు. అమెరికా మీడియా సంస్థ ఆక్సియోస్ కథనం ప్రకారం, ఇరాన్ ప్రతినిధులతో జరిగిన చర్చల అనంతరం సిద్ధమైన ముసాయిదా ఒప్పందంలో కొన్ని మార్పులు చేయాలని ట్రంప్ కోరినట్లు సమాచారం. ముఖ్యంగా ఇరాన్ వద్ద ఉన్న అణు పదార్థాల అంశంలో మరింత కఠినమైన నిబంధనలు ఉండాలని ఆయన భావిస్తున్నట్లు అమెరికా అధికారులు వెల్లడించారు. అలాగే హర్మూజ్ జలసంధి పునఃప్రారంభానికి సంబంధించిన విషయంలో కొన్ని సవరణలు చేయాలని ట్రంప్ కోరినట్లు తెలుస్తోంది. దీంతో ఇరుపక్షాల మధ్య మరోసారి చర్చలు ప్రారంభమయ్యాయి. ఈ ప్రక్రియ మరికొన్ని రోజులు కొనసాగే అవకాశం ఉందని సమాచారం. మరోవైపు, అమెరికా ప్రభుత్వం ఇరాన్‌కు అనుబంధంగా పనిచేస్తోందని ఆరోపిస్తున్న ఒక సేకరణ నెట్‌వర్క్‌పై కొత్త ఆంక్షలు విధించింది. అమెరికా కంపెనీలుగా నటిస్తూ సున్నితమైన సాంకేతిక పరికరాలను మోసపూరితంగా సంపాదించి, వాటిని ఇరాన్ రక్షణ రంగానికి చేరవేసినట్లు ఆ నెట్‌వర్క్‌పై ఆరోపణలు ఉన్నాయి. అమెరికా విదేశాంగ శాఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, ఈ నెట్‌వర్క్ ఇరాన్ రక్షణ మంత్రిత్వ శాఖ మరియు సాయుధ దళాల లాజిస్టిక్స్ విభాగం తరఫున పనిచేసినట్లు గుర్తించారు. అమెరికాలోని పలు టెక్నాలజీ సంస్థలను మోసం చేసి మిలియన్ల డాలర్ల విలువైన పరికరాలను సేకరించినట్లు ఆరోపించారు. ఈ నెట్‌వర్క్‌కు ఇరాన్‌కు చెందిన అలీ మజ్ద్ సెపెహర్ నాయకత్వం వహించినట్లు అమెరికా అధికారులు వెల్లడించారు. స్పెక్ట్రం అనలైజర్లు, భద్రతా గుర్తింపు పరికరాలు వంటి అధునాతన సాంకేతిక ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి అమెరికా సంస్థలను మభ్యపెట్టినట్లు తెలిపారు.



## ఉత్తరాఖండ్‌లో కురుస్తున్న భారీ వర్షాలు

మొదటిపేజీ తరువాయి..

నిలిపివేశారు. యాత్రికుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ నిర్వాహకులు ఈ నిర్ణయం తీసుకున్నారు. అధికారుల ప్రకారం, వాతావరణ పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చి, మార్గం సురక్షితమని నిర్ధారించిన తర్వాత యాత్రను తిరిగి ప్రారంభిస్తారు. గత రాత్రి నుంచి రుద్రప్రయాగ్ జిల్లాలో కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాల కారణంగా కేదార్‌నాథ్ ట్రెకింగ్ మార్గంలో కొండచరియలు విరిగిపడే ప్రమాదం, ఇతర ప్రమాదాలు పెరిగే అవకాశం ఉందని గర్వాల్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో, జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు యాత్రను తాత్కాలికంగా నిలిపివేశారు. యాత్రికుల భద్రతను నిర్ధారించడానికి ఈ ముందుజాగ్రత్త చర్య తీసుకున్నట్లు గర్వాల్ కమిషనర్ ఆనంద్ స్వరూప్ తెలిపారు. వాతావరణం తిరిగి సాధారణ స్థితికి వచ్చే వరకు పరిపాలన యంత్రాంగం సూచనలను పాటించాలని, నిర్దేశించిన నిరీక్షణ ప్రాంతాలు, సురక్షిత ప్రదేశాలలోనే ఉండాలని ఆయన యాత్రికులకు విజ్ఞప్తి చేశారు. కేదార్‌నాథ్ వైపు వెళ్లే యాత్రికులను శ్రీనగర్‌తో సహా పలు చోట్ల ఆపాలని సంబంధిత శాఖలను పరిపాలన యంత్రాంగం ఆదేశించింది. వాతావరణం మెరుగుపడే వరకు ఏ యాత్రికుడిని ముందుకు వెళ్లడానికి అనుమతించరు. కాగా, గత కొద్ది రోజులుగా కేదార్‌నాథ్ యాత్రకు భక్తుల తాకిడి భారీగా ఉంది. శివుని పన్నెండు జ్యోతిర్లింగాలలో ఒకటైన కేదార్‌నాథ్‌ను దర్శించడానికి ప్రతిరోజూ వేలాది మంది యాత్రికులు వస్తుంటారు. ఈ భారీ జనసందోహం కారణంగా, పాదయాత్ర మార్గంలోని అనేక ప్రదేశాలలో పొడవైన క్యూలు, ట్రాఫిక్ జామ్‌లు కనిపిస్తున్నాయి. వాతావరణాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, పరిస్థితులు సాధారణ స్థితికి రాగానే యాత్రను తిరిగి ప్రారంభించడంపై నిర్ణయం తీసుకుంటామని నిర్వాహకులు చెబుతున్నారు. వదంతులను పట్టించుకోవద్దని, నిర్వాహకులు విడుదల చేసిన అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని యాత్రికులకు విజ్ఞప్తి చేశారు.

## మళ్లీ పెరిగిన కమర్షియల్ సిలిండర్ ధర

మొదటిపేజీ తరువాయి..

వినియోగదారులపై అదనపు ఇంధన భారం పడనుంది. ఎల్పీజీ సిలిండర్ ధర రూ. 42 మేర పెరిగింది. అయితే, గృహ అవసరాలకు ఉపయోగించే డొమెస్టిక్ ఎల్పీజీ సిలిండర్ ధరలలో ఎలాంటి మార్పులు చేయకపోవడం సామాన్యులకు ఊరట కలిగిస్తోంది. సవరించిన ధరల ప్రకారం, ఢిల్లీలో 19 కిలోల కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధర రూ. 42 పెరగడంతో రిటైల్ ధర సిలిండర్‌కు రూ. 3,113.50 కి చేరింది. అలాగే హైదరాబాద్‌లో రూ.52 మేర పెరగడంతో కమర్షియల్ సిలిండర్ ధర రూ.3,367 అయింది. కోల్‌కతాలో 19 కిలోల కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధర రూ. 53.50 పెరగడంతో రిటైల్ ధర రూ. 3,255.50 కి చేరుకుంది. ఈ తాజా ధరల పెంపు వల్ల కమర్షియల్ ఎల్పీజీపై ఎక్కువగా ఆధారపడే రెస్టారెంట్లు, హోటళ్లు, క్యాటరింగ్ సర్వీసులు, చిన్న తరహా ఆహార వ్యాపార సంస్థలు తీవ్రంగా ప్రభావితం అవ్వుతాయి.



కమర్షియల్ సిలిండర్ ధరలు పెరిగితే ప్రత్యక్షంగా కాకపోయినా, పరోక్షంగా సామాన్యుడికి భారంగా మారుతుంది. హోటల్, రెస్టారెంట్స్ లలో ఫుడ్ ఐటమ్స్ ధరలు మరోసారి పెరగనున్నాయి. ఈ సవరించిన ధరలు జూన్ 1 నుండి అమలులోకి వచ్చాయి. గ్యాస్ కంపెనీలు సరిగ్గా నెల రోజుల తర్వాత కమర్షియల్ సిలిండర్ ధరలు పెంచాయి. అంతకుముందు మే 1న కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ల ధరలను భారీగా పెంచారు. మే నెలలో ఏకంగా రూ. 993 మేర పెంచారు. తాజాగా 42 మేర పెరిగింది. ఏప్రిల్ నెలలో 215 రూపాయలు, మార్చిలో 144 రూపాయల మేర 19 కేజీల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర పెంచడం తెలిసిందే. గృహ అవసరాల కోసం వినియోగించే ఎల్పీజీ డొమెస్టిక్ సిలిండర్ల ధరల్లో ప్రస్తుతానికి ఎలాంటి మార్పు చేయకపోవడం ప్రజలకు ఊరట కలిగించింది. రాజధాని ఢిల్లీలో 14.2 కిలోల సిలిండర్ ధర రూ. 913 గానే ఉంది. హైదరాబాద్‌లో డొమెస్టిక్ సిలిండర్ ధర రూ.965 వద్ద ఉంది. ఇదివరకే ద్రవ్యోల్బణంతో ఇబ్బంది పడుతున్న లక్షలాది కుటుంబాలకు దీనివల్ల ఉపశమనం లభించింది. డొమెస్టిక్ 5 కేజీల సిలిండర్ ధర రూ. 357 వద్ద కొనసాగుతుండగా.. 47.5 కేజీల కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధర రూ. 130 మేర పెరగడంతో రూ.8,412 అయింది. పశ్చిమ ఆసియాలో నెలకొన్న రాజకీయ ఉద్రిక్త పరిస్థితులు ముడి చమురు ధరలతో పాటు ఎల్పీజీ ధరల భారీ పెంపునకు కారణం అవుతున్నాయి. ప్రస్తుతం భారత్‌కు దిగుమతులలో పెరిగిన ఖర్చుల వల్ల గ్యాస్ కంపెనీలపై ఒత్తిడి పెరగడంతో ధరలు పెంచుతున్నారు.

## టీపీసీసీ డాక్టర్స్ సెల్ ములుగు జిల్లా చైర్మన్ గా డాక్టర్ రవిబాబు

ములుగు జిల్లా కరస్పాండెంట్ (మే 31)

ములుగు జిల్లా టీపీసీసీ డాక్టర్స్ సెల్ , మెడికల్ అండ్ హెల్త్ విభాగం జిల్లా చైర్మన్ గా డా.ఆనందపు రవిబాబును నియమించిన సందర్భంగా ఆదివారం ములుగు మండలం ఇంచర్ల గ్రామంలోని ఎంఆర్ ఫంక్షన్ హాల్లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర మంత్రి సీతక్క చేతుల మీదుగా నియామక





పత్రాన్ని అందుకున్నారు.ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు,ఎమ్మెల్సీ బి.మహేష్ కుమార్ గౌడ్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఈ నియామకం జరిగినట్లు తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి సీతక్క మాట్లాడుతూ శుభాకాంక్షలు తెలుపుతూ పార్టీ బలోపేతంతో పాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రవిబాబు జిల్లాలో మార్పు కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు.తనపై ఎంతో నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి డా.రవిబాబు కృతజ్ఞతలు తెలుపుతూ జిల్లా వ్యాప్తంగా డాక్టర్లను సమన్వయం చేసి ప్రజా సేవలో ముందుంటానన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్,గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి,ఆత్మ కమిటీ చైర్మన్ కొండం రవీందర్ రెడ్డి,మల్లంపల్లి సర్పంచ్ ల్యాద శ్యామ్రావు, శ్రీకాంత్ రెడ్డి, రాజశేఖర్,పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులున్నారు.

## నేటి నుంచి కనీస వేతనాలు అమలు

మొదటిపేజీ తరువాయి..

ప్రయోజనం కలగనుంది. మారుతున్న కాలంతో పాటు మార్కెట్లో విపరీతంగా పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, ద్రవ్యోల్బణం, జీవన వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ కార్మిక ఉపాధి శాఖ వేతన నిర్మాణంలో కీలకమైన సవరణలను ప్రవేశపెట్టింది. గతంలో అమలులో ఉన్న పాత జోనల్, ప్రాంతీయ పరిమితుల విధానాలను పూర్తిగా రద్దు చేస్తూ, కార్మికులు చేసే పని, వారి నైపుణ్యాల ఆధారంగా సరికొత్త సమాన వేతన పద్ధతిని రాష్ట్రవ్యాప్తంగా అమలులోకి తీసుకువచ్చింది. ప్రభుత్వం పెంచిన వేతనాలు నేటి నుంచి అమల్లోకి రానున్నాయి. గ్రామ పంచాయతీలు, పురపాలికలు, మున్సిపల్ కార్పొరేషన్ల వారీగా మూడు జోన్లుగా విభజించి, ఆయా జోన్లలో నైపుణ్య కేటగిరీల వారీగా కనీస వేతనాలను కార్మిక శాఖ ఖరారు చేసింది. మున్సిపల్ కార్పొరేషన్లను జోన్–1, మున్సిపాలిటీలను జోన్–2గా, గ్రామాలు, ఇతర ప్రాంతాలు జోన్–3గా ప్రకటించింది. కొత్తగా హైస్కిల్డ్ కేటగిరీని చేర్చి జోన్–1లో కనీస వేతనాన్ని రూ. 20 వేలుగా పెంచింది. అన్స్కిల్డ్ కేటగిరిలో జోన్–1లో రూ.16 వేలు, జోన్–2లో రూ.15 వేలు, జోన్–3లో రూ.14 వేలకు వేతనాలు ఇవ్వాలని నిర్ణయించారు. సెమీ స్కిల్డ్ విషయానికి వస్తే జోన్–1లో రూ.17 వేలు జీతం, జోన్–2లో రూ.16 వేలు, జోన్–3లో రూ.15 వేలకు వేతనాలకు సవరించారు. స్కిల్డ్ కేటగిరిలో జోన్–1లో రూ.18,500, జోన్–2లో రూ.17,500 , జోన్–3లో రూ. 16,500లకు జీతం పెంచారు. హైలీ స్కిల్డ్ కేటగిరిలో జోన్–1లో రూ.20 వేలు, జోన్–2లో రూ.19 వేలు, జోన్–3లో రూ.18 వేలకు వేతనాలు సవరించారు. కొత్తగా ఈ–కామర్స్, కొరియర్ సర్వీసు, దేవాలయాలు, మసీదులు, చర్చిలు, సామాజిక సంస్థల కార్యాలయాలు, పబ్లిక్ పార్కులు, వాటర్ థీమ్ పార్కులు, వినోద ఆహ్లాద పార్కులు, మొబైల్ టవర్ మెయింటెనెన్స్, కేబుల్ టీవీ నెట్వర్క్ సంబంధిత రంగాలు, హస్తకళల సంస్థలు, బోర్వెల్ డ్రిల్లింగ్–నిర్వహణ, రెడీమిక్స్ కాంక్రీటు యూనిట్లు, అల్యూమినియం, టిన్ ఉత్పత్తుల యూనిట్లు, ఎల్పీజీ స్టోరేజ్, పంపిణీ ఏజెన్సీలను కొత్తగా చేర్చారు. దాదాపు 14 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో వేతనాలు పెరగడం శుభసూచకంగా చెప్పుకోవచ్చు.ప్రస్తుతం కార్మిక రంగంలో పొందుతున్న వేతనాలు కొత్తగా అమల్లోకి వచ్చిన కనీస వేతనాల కన్నా ఎక్కువగా ఉంటే ఎక్కువగా ఉంటే మాత్రం కొనసాగించాలి. వారాంతపు సెలవులు, పబ్లిక్ హాలిడేస్లో పనిచేస్తే ఆ కార్మికుడికి సాధారణ వేతనంపై ఆ రోజుకి డబుల్ వేతనం చెల్లించాలి. చేసే పని సమానంగా ఉంటే లింగవివక్ష లేకుండా మహిళలకు, పురుషులకు సమాన వేతనాలు ఇవ్వాలి. రోజుకి 8 గంటల కన్నా అదనంగా పనిచేస్తే ఆ ఉద్యోగికి ఆ పనిగంటల సమయానికి తగ్గట్లుగా వేతనం చెల్లించాలి. కాంట్రాక్టర్లు, సర్వీసు ఏజెన్సీల ద్వారా కార్మికులు పనిచేస్తుంటే వారందరికీ కనీస వేతనాలు అమలయ్యేలా చెల్లించేలా ప్రధాన యజమాని తప్పకుండా బాధ్యత తీసుకోవాలి.

## డిగ్రీ, పీజీ కాలేజీలకు వేసవి సెలవులు పొడిగింపు..

రాష్ట్రంలో తీవ్రమైన వడగాలుపుల కారణంగా తెలంగాణలోని యూనివర్సిటీలు కీలక నిర్ణయం తీసుకున్నాయి.

డిగ్రీ, పీజీ కాలేజీలకు వేసవి సెలవులను జూన్ 6వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించాయి. వాస్తవానికి జూన్ 1న కాలేజీలు పునఃప్రారంభం కావాల్సి ఉండగా, తాజా నిర్ణయంతో జూన్ 6 నుంచి 8వ తేదీ మధ్య తరగతులు మొదలవుతాయి. ఉస్మానియా, పాలమూరు, తెలంగాణ, కాకతీయ, శాతవాహన యూనివర్సిటీల పరిధిలోని క్యాంపస్, అనుబంధ కాలేజీలకు ఈ నిర్ణయం వర్తిస్తుంది. ఉస్మానియా, పాలమూరు, తెలంగాణ వర్సిటీలు సెలవులను జూన్ 6 వరకు పొడిగించగా, జూన్ 7 ఆదివారం కావడంతో జూన్ 8న కాలేజీలు తెరుచుకుంటాయి. మరోవైపు, కాకతీయ, శాతవాహన వర్సిటీలు జూన్ 5 వరకు సెలవులు ప్రకటించి, జూన్ 6న తరగతులు ప్రారంభించనున్నాయి. రాష్ట్రంలో కొనసాగుతున్న తీవ్రమైన వేసవి పరిస్థితులు, అధిక ఉష్ణోగ్రతల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూనివర్సిటీలు తమ సర్క్యులర్లలో పేర్కొన్నాయి.

# ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి

మొదటిపేజీ తరువాయి..

ఉపాధ్యాయుల సేవల కంటే విద్యార్థుల భవిష్యత్తు ముఖ్యమని కోర్టు స్పష్టం చేసింది. 2009లో విద్యా హక్కు చట్టం (ఆర్టీఈ) అమల్లోకి రాకముందు నియమితులైన ఉపాధ్యాయులు కూడా టెట్ అర్హతను తప్పనిసరిగా పొందాలని గతంలో 2025 సెప్టెంబర్ 1న ఇచ్చిన తీర్పులో సుప్రీంకోర్టు పేర్కొంది. పదవీ విరమణకు ఐదేళ్లకు పైగా సమయం ఉన్న ఉపాధ్యాయులు నిర్దిష్ట గడువులోపు టెట్ ఉత్తీర్ణులు కాకపోతే ఉద్యోగంలో కొనసాగేందుకు అర్హులు కాదని తెలిపింది. అలాగే పదోన్నతులు కోరుకునే ఉపాధ్యాయులు తప్పనిసరిగా టెట్లో ఉత్తీర్ణత సాధించాలని పేర్కొంది. ఈ తీర్పును వ్యతిరేకిస్తూ వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, ఉపాధ్యాయ సంఘాలు, వ్యక్తిగత ఉపాధ్యాయులు కలిపి సుమారు 70 సమీక్ష పిటిషన్లు దాఖలు చేశారు. టెట్ను ఇన్సర్వీస్ టీచర్లకు తప్పనిసరి చేయడం వల్ల వేలాది మంది ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని, విద్యా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుందని వారు వాదించారు. అయితే ఈ వాదనలను సుప్రీంకోర్టు తిరస్కరించింది. విద్యా హక్కు చట్టం అమల్లోకి వచ్చి 15 ఏళ్లకు పైగా గడిచిందని, ఈ కాలం టెట్ అర్హత పొందడానికి సరిపోతుందని పేర్కొంది. టెట్ అర్హత లేని ఉపాధ్యాయులను కొనసాగించడం వల్ల రాబోయే తరాల విద్యా ప్రమాణాలు దెబ్బతింటాయని కోర్టు అభిప్రాయపడింది. ఉపాధ్యాయుల సమస్యల పట్ల సానుభూతి ఉన్నప్పటికీ, కేవలం భవిష్యత్తుపై భయాందోళనలు ఉండటం మాత్రమే తీర్పును పునఃసమీక్షించడానికి కారణం కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. విద్యా హక్కు చట్టం పిల్లల ప్రయోజనాలను కేంద్రంగా చేసుకుని రూపొందించబడిందని, అందుకే విద్యా ప్రమాణాలను కాపాడేందుకు టెట్ అర్హత ఉపాధ్యాయులకు తప్పనిసరి చేస్తున్నట్లు సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది.

# తెలంగాణలో ఎండల తీవ్రత

మొదటిపేజీ తరువాయి..

ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో ఆదివారం (మే 31న) వడగాల్పుల తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుందని, ఈ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ అధికారులు హెచ్చరించారు. మరోవైపు, రాష్ట్రంలోని మరికొన్ని జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాలతో పాటు నిజామాబాద్, సిద్దిపేట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో కూడా ఎండల ప్రభావం అధికంగా ఉంది.

ఈ జిల్లాల్లో తీవ్రమైన ఉక్కపోత, వేడి గాలులు వీచే ప్రమాదం ఉందని, అత్యవసరమైతే తప్ప వృద్ధులు, చిన్నపిల్లలు మధ్యాహ్నం పూట బయటకు రాకూడదని అధికారులు సూచించారు.రాష్ట్రంలో ఒకవైపు ఎండలు భయపెడుతుండగా.. మరోవైపు కొన్ని ప్రాంతాల్లో వాతావరణం అకస్మాత్తుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో నేడు ఉమ్మడి మహబూబ్ నగర్, నల్గొండ జిల్లాల్లో వర్ష సూచన ఉంది. ఈ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలులు కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. వర్షం కురిసే సమయంలో గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అకాశం ఉన్నందున, రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్లో గత కొన్ని రోజులుగా భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. తాజాగా పలుచోట్ల కురుస్తున్న వర్షాలు ఎండల నుంచి కాస్త ఉపశమనాన్ని కలిగిస్తున్నాయి. ఎండల తీవ్రతతో అల్లాడుతున్న ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది. దక్షిణ ఒడిశా మీదుగా ఉత్తరాంధ్ర వరకు ఒక ద్రోణి విస్తరించి ఉందని, దీని ప్రభావంతో ఆదివారం రాయలసీమలోని అనేక ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురవనున్నట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. నంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశం ఉందని అంచనా వేశారు. అలాగే రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడా చెదురుమదురుగా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. శనివారం సాయంత్రం వరకు వైఎస్సార్ కడప, అనంతపురం జిల్లాల్లోని ఎక్కువ ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. అనంతపురం జిల్లా హుస్సేనుపురంలో



రాష్ట్రంలోనే గరిష్ఠంగా 51 మి.మీ. వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో ఒకవైపు వర్షాలు కురుస్తున్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో ఎండల తీవ్రత ఇంకా కొనసాగుతూనే ఉంది. ఆదివారం రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల నుండి 44 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 17 మండలాలపై వడగాల్పుల ప్రభావం తీవ్రంగా ఉంటుందని అంచనా వేశారు. శనివారం నంద్యాల జిల్లా సంజామలలో అత్యధికంగా 41.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఎండలు తగ్గుతున్నప్పటికీ, వడగాలులు వీస్తున్నాయి కనుక ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.


## నేడు జేఈఈ అడ్వాన్స్డ్ పరీక్ష ఫలితాలు

మొదటిపేజీ తరువాయి..

కఠినంగా ఉన్నందున సుమారు 70 మార్కులు సాధించిన విద్యార్థులు కూడా అర్హత సాధించే అవకాశం ఉంది. సాధారణంగా జేఈఈ అడ్వాన్స్డ్ అభ్యర్థులలో సుమారు 25 నుండి 30 శాతం మంది అర్హత సాధిస్తారు. ఈ సంవత్సరం దాదాపు 45 వేల నుండి 50 వేల మంది విద్యార్థులు అర్హత సాధిస్తారని అంచనా.కాగా జేఈఈ అడ్వాన్స్డ్ పరీక్షలో వచ్చిన ర్యాంకు ఆధారంగా దేశవ్యాప్తంగా ఉన్న మొత్తం 23 ఐఐటీలలో బీ.టెక్, బీ.టెక్–ఎం.టెక్ డ్యూయల్ డిగ్రీ, బీఎస్ (సైన్స్), బీఎస్–ఎంఎస్ డ్యూయల్ డిగ్రీ వంటి కోర్సులతో సహా పలు కోర్సుల్లో సీట్లు కల్పిస్తారు. వీటిల్లో మొత్తం 18,160 సీట్లు అందుబాటులో ఉంటాయి. ఈసారి పేపర్ కష్టంగా ఉన్నప్పటికీ 2026 కౌన్సెలింగ్ ప్రక్రియలో ముగింపు ర్యాంక్ ఈ అంకెకు దగ్గరగా ఉండే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. జేఈఈ అడ్వాన్స్డ్ 2025 ఫలితాల్లో 92 మార్కులు సాధించిన ఓ విద్యార్థి 20,792వ ర్యాంకుతో ఐఐటి వారణాసి లో ఐదేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ప్రోగ్రామ్లో ప్రవేశం పొందాడు. 97 మార్కులు సాధించి 18,156వ ర్యాంకుతో ఐఐటి జమ్మూలోని మెటీరియల్స్ ఇంజనీరింగ్లో బి.టెక్లో మరో విద్యార్థికి సీటు వచ్చింది. అమ్మాయిలకు కేటాయించిన విభాగంలో 80 మార్కులతో 28,481వ ర్యాంకు సాధించి ఐఐటి వారణాసి (బిహెచ్యు)లోని ఆర్కిటెక్చర్ ప్రోగ్రామ్లో అడ్మిషన్ దొరికింది. అదే విభాగంలో మరో విద్యార్థిని 83 మార్కులతో 26,767వ ర్యాంకు సాధించి ఐఐటి జమ్మూలోని సివిల్ ఇంజనీరింగ్లో సీటు సంపాదించింది.

## సామాజిక ఉద్యమంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం

ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పేదల సొంతింటి కలలను నెరవేర్చడానికి తెలంగాణ ప్రభుత్వం భారీ గృహ నిర్మాణ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఉచితంగా 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయంతో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా తెలంగాణ రాష్ట్రం దేశానికే మార్గదర్శకంగా నిలుస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సాగుతున్న ఈ పథకం కేవలం గృహ నిర్మాణ కార్యక్రమం మాత్రమే కాకుండా, పేద కుటుంబాల జీవితాలను మార్చేసే ఒక సామాజిక ఉద్యమంగా మారిందని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ ఆలోచనలు, సూచనల మేరకు మొదటి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 4 లక్షలకు పైగా ఇళ్లను మంజూరు చేశామని మంత్రి పొంగులేటి తెలిపారు. గతేడాది ఫిబ్రవరి మూడో వారంలో నారాయణపేట జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేయగా, కేవలం 13 నెలల కాలంలోనే లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తయింది. మరో రెండు నెలల్లో ఇంకో 2 లక్షల ఇళ్లను పూర్తి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ ఆర్థిక విజయవంతమైన ప్రణాళిక దేశానికే ఒక రోల్ మోడల్గా నిలుస్తుందని చెప్పారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండవ విడత కార్యక్రమానికి జూన్ 1న ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కొరారి గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అధికారికంగా పునాది పడనుంది. అలాగే కొత్తగూడలో జరిగే సామూహిక గృహప్రవేశాల కార్యక్రమంలో కూడా పాల్గొంటారు. రెండో విడతలో 2.5 లక్షల ఇళ్ల మంజూరుతో కలుపుకుని, రెండు విడతల్లో కలిపి ఒక్కో నియోజకవర్గానికి 5500 నుండి 6500 ఇళ్లను కేటాయించినట్లు అవుతుందని మంత్రి పొంగులేటి వివరించారు. ఐటీడీఏ (ఐటీడీఏ) పరిధిలోని గిరిజన నియోజకవర్గాలకు అదనంగా మరో 500 నుండి 1500 ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు.

## జూన్ 16 నుండి టెట్

మొదటిపేజీ తరువాయి..

(ఇంగ్లీష్/తెలుగు మీడియం) -- ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హన్మకొండ, జగిత్యాల, జోగులాంబ గద్వాల, కామారెడ్డి, మెదక్, ములుగు, నల్గొండ, నారాయణపేట జిల్లాల అభ్యర్థులకు పరీక్ష షిఫ్ట్ 2 (మధ్యాహ్నం 2:00 -- 4:30): పేపర్–1 (ఇంగ్లీష్/తెలుగు మీడియం) -- జనగాం, కరీంనగర్, ఖమ్మం, కుమురం భీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, మహబూబ్నగర్, నిజామాబాద్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల అభ్యర్థులకు. జూన్ 17, 2026 (బుధవారం): షిఫ్ట్ 1 (ఉదయం 9:00 -- 11:30):లిలి పేపర్–1 (ఇంగ్లీష్/తెలుగు మీడియం) -- హైదరాబాద్, జయశంకర్ భూపాలపల్లి, మంచిర్యాల, మేడ్చల్ మల్కాజ్గిరి, నాగర్కర్నూల్, నిర్మల్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వనపర్తి, వరంగల్, యాదాద్రి భువనగిరి, ఇతర జిల్లాల వారికి పరీక్ష ఉంటుంది. షిఫ్ట్ 2 (మధ్యాహ్నం 2:00 -- 4:30) పేపర్–×× (మ్యాథ్స్ ఙ సైన్స్) -- (ఇంగ్లీష్/తెలుగు మీడియం) -- ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హన్మకొండ, జగిత్యాల, జోగులాంబ గద్వాల, కామారెడ్డి, మెదక్, మేడ్చల్ మల్కాజ్గిరి, నల్గొండ, యాదాద్రి భువనగిరి మరియు ఇతర జిల్లాలు వారికి పరీక్ష ఉంటుంది. జూన్ 18, 2026 (గురువారం) షిఫ్ట్ 1 (ఉదయం 9:00 -- 11:30) పేపర్–×× (మ్యాథ్స్ ఙ సైన్స్) -- (ఇంగ్లీష్/తెలుగు మీడియం) -- జనగాం, కరీంనగర్, ఖమ్మం, కుమురం భీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, మహబూబ్నగర్, నారాయణపేట, నిజామాబాద్, సంగారెడ్డి, వికారాబాద్, వనపర్తి జిల్లాల వారికి వారికి పరీక్ష ఉంటుంది. షిఫ్ట్ 2 (మధ్యాహ్నం 2:00 -- 4:30) పేపర్–×× (మ్యాథ్స్ ఙ సైన్స్) -- (ఇంగ్లీష్/తెలుగు మీడియం) -- హైదరాబాద్, జయశంకర్ భూపాలపల్లి, మంచిర్యాల, ములుగు, నాగర్కర్నూల్, నిర్మల్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్ జిల్లాల వారికి వారికి పరీక్ష ఉంటుంది. జూన్ 19, 2026 (శుక్రవారం) షిఫ్ట్ 1 (ఉదయం 9:00 -- 11:30): పేపర్–×× (సోషల్ స్టడీస్) -- (ఇంగ్లీష్/తెలుగు మీడియం) -- ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హన్మకొండ, హైదరాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల, కామారెడ్డి, మంచిర్యాల, మెదక్, ములుగు, నాగర్కర్నూల్, పెద్దపల్లి, సిద్దిపేట, సూర్యాపేట, వికారాబాద్, వనపర్తి జిల్లాల వారికి పరీక్ష ఉంటుంది. షిఫ్ట్ 2 (మధ్యాహ్నం 2:00 -- 4:30) పేపర్–×× (సోషల్ స్టడీస్) -- (ఇంగ్లీష్/తెలుగు మీడియం) -- జనగాం, కరీంనగర్, ఖమ్మం, కుమురం భీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, మహబూబ్నగర్, మేడ్చల్ మల్కాజ్గిరి, నల్గొండ, నారాయణపేట, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సంగారెడ్డి, వరంగల్, యాదాద్రి భువనగిరి అభ్యర్థులకు పరీక్ష ఉంటుంది. జూన్ 22, 2026 (సోమవారం) షిఫ్ట్ 1 (ఉదయం 9:00 -- 11:30): పేపర్–×× (మ్యాథ్స్, సైన్స్ మరియు సోషల్ స్టడీస్) -- మైనర్ లాంగ్వేజెస్ (హిందీ, కన్నడ, తమిళం, ఉర్దూ, మరాఠీ, సంస్కృతం) -- అన్ని జిల్లాల వారికి వారికి పరీక్ష ఉంటుంది. షిఫ్ట్ 2 (మధ్యాహ్నం 2:00 -- 4:30): పేపర్–× -- మైనర్ లాంగ్వేజెస్ (హిందీ, కన్నడ, తమిళం, ఉర్దూ, మరాఠీ, సంస్కృతం, బెంగాలీ) -- అన్ని జిల్లాల వారికి పరీక్ష ఉంటుంది.

GENNEX LABORATORIES LIMITED you can trust

**జెనెక్స్ లాబొరేటరీస్ లిమిటెడ్**

CIN : L24230TG1990PLC011168

రిజిస్టర్డ్ ఆఫీస్ చిరునామా: సర్వే నెం. 133, ఐడిఎ బొల్లారం, జిన్నారం మండలం, మెదక్, సంగారెడ్డి జిల్లా-502 325, తెలంగాణ రాష్ట్రం, ఇండియా

మార్చి 31, 2026తో ముగిసిన త్రైమాసికం & సంవత్సరానికి ఆడిట్ చేయబడిన ఆర్థిక ఫలితాలు (స్టాండ్ అలోన్ & కన్సాలిడేటెడ్)
[SEBI (LODR రెగ్యులేషన్, 2015) యొక్క రెగ్యులేషన్ 47(1) (b) చూడండి]

(రూ. వేలల్లో)

| క్ర. సం. | వివరాలు | స్టాండ్ అలోన్ | | | | | కన్సాలిడేటెడ్ | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | ముగిసిన త్రైమాసికం | | | ముగిసిన సంవత్సరం | | ముగిసిన త్రైమాసికం | | | ముగిసిన సంవత్సరం | |
| | | 31.03.2026 ఆడిట్ చేసిన | 31.12.2025 ఆడిట్ చేయని | 31.03.2025 ఆడిట్ చేసిన | 31.03.2026 ఆడిట్ చేసిన | 31.03.2025 ఆడిట్ చేసిన | 31.03.2026 ఆడిట్ చేసిన | 31.12.2025 ఆడిట్ చేయని | 31.03.2025 ఆడిట్ చేసిన | 31.03.2026 ఆడిట్ చేసిన | 31.03.2025 ఆడిట్ చేసిన |
| 1 | కార్యకలాపాల నుండి మొత్తం ఆదాయం | 3801.20 | 3071.23 | 2614.99 | 12799.68 | 10379.92 | 6227.37 | 4295.62 | 4415.97 | 18098.67 | 14833.31 |
| 2 | పన్నుకు ముందు ఈ కాలపు నికర లాభం / (నష్టం) అసాధారణ మరియు/లేదా విశేష అంశాలు# | 350.33 | 525.10 | 232.66 | 1883.70 | 1721.16 | 496.75 | 694.22 | 410.46 | 2383.77 | 2154.96 |
| 3 | పన్నుకు ముందు ఈ కాలపు నికర లాభం / (నష్టం) (అసాధారణ మరియు / లేదా విశేష అంశాల# తర్వాత) | 320.33 | 525.10 | 217.66 | 1823.70 | 1706.16 | 466.75 | 664.22 | 395.46 | 2323.77 | 2139.96 |
| 4 | పన్ను తర్వాత కాలానికి నికర లాభం / (నష్టం) (అసాధారణ మరియు/లేదా అసాధారణ అంశాల# తర్వాత) | 299.44 | 475.10 | 150.19 | 1612.81 | 1403.68 | 445.86 | 599.22 | 306.99 | 2097.88 | 1812.49 |
| 5 | కాలానికి సంబంధించిన మొత్తం సమగ్ర ఆదాయం [కాలానికి సంబంధించిన లాభం / (నష్టం) (పన్ను తర్వాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తర్వాత) చేరి ఉన్నది] | 304.63 | 475.10 | 150.19 | 1618.00 | 1403.68 | 451.05 | 599.22 | 306.99 | 2103.07 | 1812.49 |
| 6 | ఈక్విటీ షేర్ క్యాపిటల్ | 2429.48 | 2429.48 | 2274.48 | 2429.48 | 2274.48 | 2429.48 | 2429.48 | 2274.48 | 2429.48 | 2274.48 |
| 7 | రిజర్వులు (రీవాల్యుయేషన్ రిజర్వులు మినహా) గత సంవత్సరం ఆడిట్ చేయబడిన బ్యాలెన్స్ షీట్లో చూపిన విధంగా | | | | 19382.45 | 15633.20 | | | | 19822.50 | 15822.26 |
| 8 | ఒక్కో షేరుకు సంపాదన (ఒక్కొక్కటి రూ.1/-) (కొనసాగించే మరియు నిలిపివేయబడిన కార్యకలాపాల కోసం) | | | | | | | | | | |
| | బేసిక్ | 0.125 | 0.196 | 0.066 | 0.666 | 0.617 | 0.156 | 0.216 | 0.135 | 0.762 | 0.797 |
| | డైల్యూటెడ్ | 0.125 | 0.196 | 0.065 | 0.666 | 0.607 | 0.156 | 0.216 | 0.133 | 0.762 | 0.784 |

గమనిక:
ఎ) పైన పేర్కొన్న ఆడిట్ చేయబడిన ఆర్థిక ఫలితాలను ఆడిట్ కమిటీ సమీక్షించింది మరియు మే 30, 2026 న జరిగిన డైరెక్టర్ల బోర్డు సమావేశంలో ఆమోదించింది.
బి) సెబి (లిస్టింగ్ మరియు ఇతర డిస్క్లోజర్ రిక్వైర్మెంట్స్) రెగ్యులేషన్స్, 2015లోని రెగ్యులేషన్ 33 ప్రకారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు దాఖలు చేసిన త్రైమాసిక ఫలితాల యొక్క వివరణాత్మక ఫార్మాట్ యొక్క సారం. త్రైమాసిక మరియు ఆర్థిక సంవత్సర ఫలితాల పూర్తి ఫార్మాట్ స్టాక్ ఎక్స్ఛేంజ్(లు) మరియు లిస్టెడ్ ఎంటిటీ వెబ్సైట్ (www.bseindia.com) మరియు కంపెనీ వెబ్సైట్లో (www.gennexlab.com) అందుబాటులో ఉంటుంది.

ప్రదేశం: హైదరాబాద్
తేది: మే 30, 2026

జెనెక్స్ లేబొరేటరీస్ లిమిటెడ్ కొరకు
సం/- అరిహంత్ బైద్, మేనేజింగ్ డైరెక్టర్
DIN: 01171845

## సైనిక్ స్కూల్ విద్యార్థులకు ప్రోత్సాహక సన్మానం



**ఖానాపురం మే31 (సాక్ష్యం న్యూస్) :** సీబీఎస్సీ పదవ తరగతి మరియు ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో అత్యంత ప్రతిభ కనబరచి టాపర్లు గా నిలిచిన పదవ తరగతి నుండి ముగ్గురు ఇంటర్ ద్వితీయ సంవత్సరం నుండి ముగ్గురు మొత్తం ఆరుగురు విద్యార్థులకు హైదరాబాదులో నిర్వహించిన గిరిజన గురుకులాల "అకాడమిక్ సక్సెస్ మీట్" లో భాగంగా సాంఘిక సంక్షేమ మరియు గిరిజన సంక్షేమ శాఖ మాత్యులు అట్లూరి లక్ష్మణ్ , రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ , స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు వద్మా బోజ్జు, నవీన్ యాదవ్,ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ , గిరిజన గురుకులాల కార్యదర్శి శ్రీమతి సీతాలక్ష్మి ల చేతుల మీదుగా ప్రతి విద్యార్థి రూపాయలు పదివేల నగదు పురస్కారాన్ని పొందారని ప్రిన్సిపల్ గట్ల సురేందర్ తెలిపారు.




అదేవిధంగా పదవ తరగతిలో 100% ఫలితాలు సాధించిన కారణంగా ప్రిన్సిపల్ గట్ల సురేందర్ కూడా సన్మానాన్ని పొందడం జరిగిందని తెలిపారు. పదవ తరగతి నుండి సన్మానం పొందిన తమ విద్యార్థులు భూక్య తోసిల్ సాయిరాం 448/500, ధరావత్ సంతోష్ 444/500, నేనావత్ అంకిత్ 488/500 మార్కులు పొంది టాపర్లుగా నిలిచారని అదేవిధంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం నుండి కార్తీక్ రెడ్డి 385/500, శివశంకర్ 383/ 500 శ్రీధర చారి 378/500 మార్కులతో టాపర్లుగా నిలిచారని తెలిపారు. ఈ అద్భుత ఫలితాలు తమ విద్యార్థులు మరియు ఉపాధ్యాయ సిబ్బంది అంకిత భావంతో ప్రణాళిక బద్ధంగా చేస్తున్న కృషికి నిదర్శనమని, ఈ అద్భుత ఫలితాలకు కారణమైన విద్యార్థులు మరియు ఉపాధ్యాయులను ప్రిన్సిపల్ గట్ల సురేందర్, డైరెక్టర్ దామోదర్ రెడ్డి మరియు విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

## టీపీసీసీ డాక్టర్స్ సెల్ ములుగు జిల్లా చైర్మన్‌గా డాక్టర్ రవిబాబు



**ములుగు జిల్లా కరస్పాండెంట్ (మే 31)** ములుగు జిల్లా టీపీసీసీ డాక్టర్స్ సెల్ , మెడికల్ అండ్ హెల్త్ విభాగం జిల్లా చైర్మన్ గా డా.ఆనందపు రవిబాబును నియమించిన సందర్భంగా ఆదివారం ములుగు మండలం ఇంచర్ల గ్రామంలోని ఎంఆర్ ఫంక్షన్ హాల్లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర మంత్రి సీతక్క చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు.ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు,ఎమ్మెల్సీ బి.మహేష్ కుమార్ గౌడ్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఈ నియామకం జరిగినట్లు తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి సీతక్క మాట్లాడుతూ శుభాకాంక్షలు తెలుపుతూ పార్టీ బలోపేతంతో పాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రవిబాబు జిల్లాలో మార్పు కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు.తనపై ఎంతో నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన పార్టీ అధిష్టానానికి డా.రవిబాబు కృతజ్ఞతలు తెలుపుతూ జిల్లా వ్యాప్తంగా డాక్టర్లను సమన్వయం చేసి ప్రజా సేవలో ముందుంటానన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి,ఆత్మ కమిటీ చైర్మన్ కొండం రవీందర్ రెడ్డి, మల్లంపల్లి సర్పంచ్ ల్యాద శ్యామ్రావు, శ్రీకాంత్ రెడ్డి, రాజశేఖర్, పార్టీ నాయకులు, కార్య కర్తలు తదితరులున్నారు.

### నగర గ్రంథాలయ సంస్థ
## కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన అలివేలు



**హైదరాబాద్,హామే 31 ( సాక్ష్యం న్యూస్ ) :** హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ కార్యదర్శిగా ఎం.అలివేలు బాధ్యతలు స్వీకరించారు. గ్రంథాలయం కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో అలివేలు ను హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేసిరెడ్డి ఉపేందర్ రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ... పాఠకులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు బొల్లం మహేందర్, అవినాష్ , వెంకటేష్ యాదవ్, వెంకటేశ్వర్ రెడ్డి, రామ్మోహన్, కృష్ణారెడ్డి, శ్రీకాంత్, మహేష్, శ్రీనివాస నాయక్, మస్తాన్ పాల్గొన్నారు.

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి
## పదవి విరమణ సన్మాన కార్యక్రమం



**మహబూబాబాద్ జిల్లా కరస్పాండెంట్ సాక్ష్యం న్యూస్( మే 31):** మహబూబాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ 31 మే 2026 పదవి కాలం ముగిసిన సందర్భంగా ముఖ్య పరిపాలన అధికారి ఎస్ ఎస్ పి శ్రీనివాస్ మరియు న్యాయశాఖ ఉద్యోగులు ఘన సన్మానం కార్యక్రమము ఏర్పాటు చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా జడ్జి ఇన్చార్జి మహబూబాబాద్ జిల్లా జడ్జి శ్రీమతి ఎం.ఆర్ సునీత, జూనియర్ సివిల్ జడ్జి స్వాతి మురారి మరియు తెలంగాణ రాష్ట్ర న్యాయమూర్తుల సంఘం ఈసీ శ్రీమతి పూజ మరియు నారాయణపేట ఖమ్మం, కొత్తగూడెం జిల్లా ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ కార్యక్రమం సీనియర్ సూపరింటెంట్ కె .నరసింహమూర్తి , ముబిన్ అహ్మద్ అధ్యక్షత వహించగా న్యాయశాఖ సంఘం అధ్యక్షులు పోలేపల్లి శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి , అనిత అసోసియేట్ ప్రెసిడెంట్ కోశాధికారి వీరు నాయక్ ఆర్గనైజేషన్ సెక్రటరీ పూస శ్రీనివాస్ స్వాతి మరియు గతంలో మహబూబాబాద్ జిల్లా నందు పనిచేసే బదిలీపై వెళ్లిన ఎం క్రాంతి కుమార్ , జిల్లా న్యాయ సేవా సదన్ సిబ్బంది టీఎస్ సీపీఎస్ఈ యు రాష్ట్ర కార్యదర్శి ముబీన్ అహ్మద్ , మొహమ్మద్ అబ్దుల్ రఫీ హసీనా దంపతులను ఘనంగా గజమాలతో సన్మానించి శాలువలతో సత్కరించి న్యాయా శాఖ ఉద్యోగులు మెమెంటో ను అందజేయడం జరిగినది కార్యక్రమంలో భాగంగా లీగల్ వాలంటరీలు పాల్గొనడం జరిగినది.

## గడువులోగా ధాన్యం కొనుగోలు పూర్తవ్వాలి

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**ఖానాపురం, మే 31 సాక్ష్యం న్యూస్ ) :** నైరుతి రుతుపవనాల రాక నేపథ్యంలో రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని గడువులోగా పూర్తిగా సేకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. ఆదివారం ఖానాపురం మండలంలోని మనుబోతుల తండా, పెద్దమ్మగడ్డ తండా, ఖానాపూర్ మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం సేకరణ పురోగతి, రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలు, హమాలీల అందుబాటు తదితర అంశాలపై ఆరా తీశారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులతో మాట్లాడిన కలెక్టర్, ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. హమాలీల కొరత ఉందని రైతులు చెప్పడంతో కొనుగోలు పూర్తయిన కేంద్రాల నుంచి హమాలీలను అవసరమైన కేంద్రాలకు తరలించి సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.అనంతరం రైతులకు పంట అవశేషాల కాల్చివేత వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలను వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల భూసారం తగ్గిపోవడంతో పాటు నేలలోని సూక్ష్మ జీవులు నశించి భూమి సారవంతత దెబ్బతింటుందని తెలిపారు. దీని ప్రభావం భవిష్యత్తులో పంట దిగుబడులపై పడుతుందని, రైతులు పంట అవశేషాలను కాల్చకుండా ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించాలని సూచించారు. ఖానాపురం మండలంలోని శ్రీనివాసరావు రైస్ మిల్, సాయి కృష్ణ రైస్ మిల్, గోపీకృష్ణ ఆగ్రో ఏజెన్సీలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ధాన్యం బస్తాల నాణ్యత, బరువు, రికార్డులు, రసీదులను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా తూకాలు సక్రమంగా నిర్వహించాలని, ధాన్యం స్వీకరణలో పారదర్శకత పాటించాలని మిల్లర్లకు సూచించారు. రైతుల ప్రయోజనాలకు భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు.ఈ సందర్శనలో అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రామ్ రెడ్డి, నర్సంపేట ఆర్డిఓ ఉమారాణి, ఖానాపురం తహశీల్దార్ నంగునూరి రమేష్ ,ఎస్ ఐ జి. రాంమోహన్ సంబంధిత శాఖల అధికారులు, రైతుల ఉన్నారు.

## అగ్ని వీరులుగా సైనిక్ స్కూల్ విద్యార్థుల ఎంపిక







**ఖానాపురం మే31 (సాక్ష్యం న్యూస్ ) :** భారత సైన్యంలో సేవలందించే యువకుల కోసం భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం నిర్వహించే "అగ్ని వీర్" సెలక్షన్స్ లో అత్యంత ప్రతిభ కనబరచి తమ సైనిక్ స్కూల్ అశోక్ నగర్ విద్యార్థులు 8 మంది అర్హత సాధించడం గర్వంగా భావిస్తున్నామని ప్రిన్సిపల్ గట్ల సురేందర్ తెలిపారు.ఈ విద్యార్థులు డిగ్రీ తృతీయ సంవత్సరం నుంచి ఆలం రాహుల్, భూక్య కౌశిక్, మరిపెడ్డి సందీప్, శివ గణేష్, డిగ్రీ ద్వితీయ సంవత్సరం నుంచి విస్లావత్ అనిల్,జరుపుల అనిల్, బానోత్ అరవింద్ మరియు డిగ్రీ ప్రథమ సంవత్సరం నుంచి ఆదె పృథ్వీరాజు ఎన్నికయ్యారని తెలిపారు. ఈ సెలక్షన్స్ తమ సైనిక్ స్కూల్ లో ప్రణాళిక బద్ధంగా విద్యార్థులకు అందిస్తున్న కోచింగ్ కి నిదర్శనమని తెలిపారు. తమ పాఠశాలలోని నిర్వహిస్తున్న జూనియర్ మరియు సీనియర్ డివిజన్ ఎన్సీసీలు, ఆర్మీ, ఎన్సిసి సిబ్బంది అందిస్తున్న శిక్షణ, సలహా సూచనలు మరియు ఉపాధ్యాయ సిబ్బంది నిరంతర పర్యవేక్షణ మరియు కృషికి నిదర్శనమని తెలిపారు.భారత సైన్యంలోకి అగ్ని వీరులుగా ఎంపికైన ఎనిమిది మంది విద్యార్థులను సాంఘిక సంక్షేమ మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అట్లూరి లక్ష్మణ్ ,తెలంగాణ గిరిజన గురుకుల కార్యదర్శి సీతాలక్ష్మి ఐఏఎస్ , అడిషనల్ సెక్రటరీ నటరాజన్, డిప్యూటీ సెక్రటరీ డిఎస్ వెంకన్న , పాఠశాల డైరెక్టర్ దామోదర్ రెడ్డి ఇతర ఉపాధ్యాయు, ఉపాధ్యాయేతర సిబ్బంది, తల్లిదండ్రులు అభినందించారు.




**యర్రగొండపాలెం మట్టిలో దాగిన శాపమా..?**

- మన పిల్లలకు మిగిల్చేది నీళ్లా..నిందలా..?
- రాళ్లవాగు నుండి శ్మశానం దాకా ఆక్రమణల ఆరోపణలు..?
- మౌనంగా చూస్తున్న సమాజానికి భవిష్యత్తు ఇస్తున్న హెచ్చరిక..!

**మార్కాపురం జిల్లా బ్యూరో : సాక్ష్యం** ఎన్టీఆర్ జయంతి రోజు ఆయన విగ్రహం దగ్గర " రామారావు సాక్షిగా ఎర్రగొండపాలెంకు మంచి రోజులు రావాలి " అని నినదించిన గొంతులు,మరుసటి రోజే మరో ప్రశ్నతో మూగబోతున్నాయి. "మంచి రోజులు ఎలా వస్తాయి..?మన కాళ్ల కింద భూమే మాయమైపోతుంటే " అని ఓ వృద్ధ రైతు వై జంక్షన్ దగ్గర నిలబడి అడిగిన మాట ఇప్పుడు యర్రగొండపాలెం నలుమూలా ప్రతిధ్వనిస్తోంది.ఒకప్పుడు 410 ఎకరాలకు పైగా విస్తరించి వేల ఎకరాలకు పంటనిచ్చిన చెరువు ఇప్పుడు గుర్తు తెలియని మైదానంలా మారింది. అక్కడ నీళ్లు నిల్వ ఉండాల్సిన చోట ఇళ్లు, షెడ్లు వెలిశాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.వర్షం పడితే నీరు చేరాల్సిన చెరువు కళ్లాలు కుంచించుకుపోతుంటే,వరద వచ్చినప్పుడు నీరు వెళ్లే దారి లేక ఊరి వీధులే కాలువలు అవుతున్నాయి.రాళ్లవాగు పరిధిలో రియల్ ఎస్టేట్ వంతెన నిర్మాణం జరిగిందన్న మాటలు విన్నప్పుడు,వాగు తల్లి కడుపు కోసేస్తున్నామా అనే భయం పుడుతోంది..! చెరువు పోతే పోయింది,కనీసం మన పంచాయతీ కార్యాలయానికి,మండల ప్రజా పరిషత్‌కు,ప్రభుత్వ ఆసుపత్రికి,పిల్లలు ఆడుకునే హైస్కూల్ మైదానానికి భూమి మిగులుతుందా..?అంటే అక్కడ కూడా ఆక్రమణల మబ్బులు కమ్ముకున్నాయన్న గుసగుసలు వినిపిస్తున్నాయి..! పశువుల బీడులు, శ్మశాన వాటికలు, పురాతన కోనేర్లు, దేవస్థానం అసైన్మెంట్ భూములు, జాతీయ రహదారి పక్క స్థలాలు.. ఒక్కొక్కటిగా ఆక్రమణల జాబితాలోకి చేరుతున్నాయి. రాళ్లవాగు స్థలంలో ఆక్రమంగా చర్చిలు, మసీదులు, దేవాలయాల నిర్మాణాలు,అసైన్మెంట్ భూమిలో ప్రైవేట్ స్కూల్ ల తరగతి గదుల నిర్మాణాల కట్టడాలు లాంటి ఆరోపణలు కూడా తెర పైకి వస్తున్నాయి. ఇంత జరుగుతుంటే అధికారులు ఎందుకు మాట్లాడటం లేదు..?అధికార పక్షం,ప్రతిపక్షం ఎందుకు గొంతు పెగలడం లేదు..?ప్రజలు ఎందుకు రోడ్డుపైకి రావడం లేదు..? సమాధానం సింపుల్.భయం..? ఎదిరిస్తే రాబోయే ఎన్నికల్లో టికెట్ పోతుందేమో అన్న నాయకుడి భయం..!రికార్డులు తవ్వితే తన మీద కేసు వస్తుందేమో అన్న అధికారి భయం. " మనకెందుకులే,మన బతుకు మనం బతుకుదాం " అనుకునే సామాన్యుడి నిర్లిప్తత.ఈ మూడు కలిస్తే కబ్జాదారుడికి రాజ్యం ఇచ్చినట్టే.కానీ ప్రకృతి మౌనంగా ఉండదు మిత్రమా. చెరువును పూడ్చేస్తే వర్షం పడినప్పుడు ఆ నీరు ఎక్కడికి వెళ్తుంది..?వాగును ఆక్రమిస్తే వరద నీరు ఊరినే ముంచుతుంది..పశువుల బీడు లేకపోతే రేపు పాలు లీటరు వంద రూపాయలు అవుతుంది..శ్మశానానికి స్థలం లేకపోతే మన చివరి యాత్రకు దిక్కు ఎక్కడ..? హైస్కూల్‌కు ఆటస్థలం లేకపోతే మన పిల్లలు మొబైల్ కే బానిసలు అవుతారు..ఆసుపత్రి విస్తరించడానికి భూమి లేకపోతే జ్వరం వచ్చినా మార్కాపురం, ఒంగోలు పరిగెత్తాల్సిందే..!ఈరోజు కబ్జా చేసిన వాడికి రెండెకరాలు చేతికి వస్తుంది.రేపు కోర్టు సర్వే చేసి " ఇది ప్రభుత్వ భూమి " అని తేల్చిన రోజున కట్టిన భవనం కూలిపోతుంది,పెట్టిన కోటి రూపాయలు బూడిద అవుతుంది,పిల్లలు పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతారు.అది ఎవరికైనా శాశ్వతం కాదు..మనం మన పిల్లలకు ఏం మిగిలిస్తున్నాం..? నిండుగా నీళ్లతో నవ్వుతున్న చెరువునా..? లేక కాంక్రీట్ జంగల్‌నా..? పరుగులు పెట్టే ఆటస్థలాన్నా..? లేక బడి గోడలనా..?యర్రగొండపాలెంలో పదిమంది ఏకంగా జాతీయ రహదారికి ఒక వైపునా ప్రభుత్వ ఖర్చులతో ఏర్పాటు చేసిన డ్రైనేజి కాలువ ను సైతం కబ్జా చేసియున్నాడు..?తరతరాలుగా వెలుగుతున్న శ్మశానపు నిప్పునా..? లేక " ఇక్కడ ఒకప్పుడు శ్మశానం ఉండేది " అనే బోర్డునా..? " యర్రగొండపాలెంలో సైకిల్‌కు గాలి పోతోంది. గమనించండి మహాప్రభూ " అని తెలుగు తమ్ముళ్లు అధిష్ఠానాన్ని వేడుకుంటున్నారు. ఎన్టీఆర్ పెట్టిన పార్టీ,చంద్రబాబు నడిపే ప్రభుత్వం అయినా ప్రభుత్వ భూమి అంటే మనందరి తల్లి.తల్లి కడుపు కోస్తే కొడుకు ఎలా బతుకుతాడు..?భవిష్యత్తు తరాలు మన ఫోటోలు చూసి "మా తాతలు ఊరును కట్టారు " అని గర్వంగా చెప్పుకోవాలా..? లేక " మా తాతలు ఊరి భూములను అమ్మేశారు " అని తలదించుకోవాలా..? సమాధానం ఇప్పుడు మన చేతుల్లోనే ఉంది.అధికారులు వెంటనే సర్వే చేసి,కబ్జాలను తొలగించి, యర్రగొండపాలెం మట్టికి దాని పవిత్రత తిరిగి ఇవ్వాలి.లేకపోతే ఈ కబ్జాల కథ యర్రగొండపాలెం చరిత్రలో ఒక శాశ్వతమైన నల్లమచ్చగా మిగిలిపోతుంది.

**ముగింపు**

**ప్రభుత్వ ఆస్తి అంటే ఎవరి సొత్తు కాదు.అది మన పిల్లల భవిష్యత్తు.ఆ భవిష్యత్తును కబ్జా చేయడానికి మనమే సహకరిస్తే,రేపు మన పిల్లలు మనల్ని క్షమించరు.**

## వరి ధాన్యం ప్రక్రియ నిబంధనల ప్రకారం చేపట్టాలి



**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి(సాక్ష్యం)మే 31 :** రైతు సంక్షేమంలో ప్రభుత్వం చేపట్టిన కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలను నిబంధనల ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం జిల్లాలోని చెన్నూర్ మండలం ఒతుకులపల్లి, ఆస్నాద్, సోమనపల్లి లలో గల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు, చెన్నూర్ మండల కేంద్రంలోని గోదామును మండల తహసిల్దార్ మల్లికార్జున్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని, కొనుగోలు ప్రక్రియను ఎలాంటి అవాంతరాలు లేకుండా పారదర్శకంగా, వేగంగా నిర్వహించాలని తెలిపారు. ఈ క్రమంలో కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, తూకం యంత్రాలు, ప్యాడీ క్లీనర్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యాన్ని గోదాములలో నిల్వ చేయాలని తెలిపారు. ధాన్యం నిల్వ, తరలింపులో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశిత సమయానికి అనుగుణంగా ధాన్యం ప్రక్రియను వేగవంతం చేయాలని, లక్ష్యాలను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల నేలపై రక్తపు కన్నీరు: జిల్లా అధ్యక్షులు షేక్ సైదా

**మార్కాపురం జిల్లా బ్యూరో : సాక్ష్యం**

పేదవాడి దేవుడు,అన్నపూర్ణ,ఆరోగ్య శ్రీ ప్రదాత వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ఆదివారం నాడు నంద్యాల శ్రీనివాస్ సెంటర్‌లో తెల్లవారుజామున కొందరు కుట్రకోరులు,దేశద్రోహులు సుత్తెలతో కొట్టి పగలగొట్టారు.తలను తెగ్గొట్టి చేతిలో పట్టుకుని రాక్షస నాట్యం చేసిన దృశ్యం చూసి తెలుగు తల్లి కన్నీరు పెట్టుకుంది.పట్టపగలు, పోలీసు బూట్ల చప్పుడు వినిపించే దూరంలో, జనం మౌనంగా,బెదురుగా చూస్తుండగా జరిగిన ఈ మహా పాపానికి ప్రకాశంజిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి షేక్ సైదా మార్కాపురం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన అగ్నికుండమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది విగ్రహం విరగడం కాదు.ఇది ఆంధ్రుల కోట్ల మంది పేదల గుండె మీద సుత్తెతో కొట్టడం. అన్నం పెట్టిన చేతిని నరికేసిన పాపం.ఆరోగ్య శ్రీ తో లక్షల ప్రాణాలు కాపాడిన గుండెను పిండేసిన కిరాతకం.రాజ్యాంగం ఇచ్చిన గౌరవాన్ని,మహనీయుడి పట్ల ఉండాల్సిన భక్తిని బురదలో కలిపి,రోడ్డు పై తొక్కిన సిగ్గుమాలిన,దుర్మార్గపు చర్య అని ఆయన కన్నీరు మున్నీరుగా ఆక్రోశించారు.పోలీసులు కళ్లెదుట జరుగుతుంటే చేతులు ముడుచుకు,మౌనంగా చూస్తూ ఉండిపోయారంటే చట్టం చచ్చిపోయింది. పాలకుల మదం తలకెక్కి,కళ్లు కప్పింది. డబల్ ఇంజన్ అని గర్జించే వారు, మహనీయుడి విగ్రహానికి కూడా కాపలా ఇవ్వలేకపోతే,పేదవాడి గుడిసెకు రక్షణ ఎక్కడ..? ఇది ప్రజాస్వామ్య సమాధి పై కొట్టిన చివరి మేకు.ఇది పాలకుల పతనానికి నాంది.చరిత్ర క్షమించదు,ప్రజలు మరచిపోరు అని షేక్ సైదా ఉరిమారు.

**భారతీయ న్యాయ సంహిత గర్జన – శిక్ష తప్పదు :**

1.సెక్షన్ 298 : మహనీయుల పట్ల గౌరవాన్ని, ప్రజల మనోభావాలను కించపరిచే ఉద్దేశంతో చేస్తే రెండు సంవత్సరాల కఠిన కారాగారం, భారీ జరిమానా తప్పదు.

2.సెక్షన్ 324 : ప్రజా ఆస్తిని కావాలని,కుట్రతో నాశనం చేస్తే ఐదు సంవత్సరాల జైలు, జరిమానా విధించాలి.

3.సెక్షన్ 152 : దేశ ఐక్యతకు,సమగ్రతకు భంగం కలిగించే చర్యగా పరిగణించి దేశద్రోహ కేసు నమోదు చేసి జీవిత ఖైదు విధించాలి.

**కాంగ్రెస్ పార్టీ ప్రజాగ్రహం – రాజ్యాంగబద్ధ హెచ్చరిక :**

సూర్యుడు అస్తమించేలోగా దుండగులను బంధించి,పైన చెప్పిన సెక్షన్ల కింద కేసు పెట్టి, చట్టం ముందు నిలబెట్టి కఠిన శిక్ష విధించాలి. చట్టం తన పని తాను చేసుకోవాలి. విరిగిన విగ్రహ స్థానంలో బంగారు వర్ణంలో మెరిసే,ప్రపంచం మెచ్చే కొత్త విగ్రహం నిలబెట్టాలి.అది పాలకుల నిర్లక్ష్యానికి,వ్యవస్థ చావుకు చెంపపెట్టు కావాలి. పోలీసు నిర్లక్ష్యానికి,కుమ్మక్కుకు కారణమైన అధికారులను వెంటనే సస్పెండ్ చేసి విభాగపరమైన విచారణ జరపాలి.పాలకుల కుర్చీలు కదలాలి,పునాదులు కూలిపోవాలి. వైయస్ అంటే ఒక మనిషి కాదు.ఆయన పేదవాడి ఇంటి దీపం,రైతు కంటి వెలుగు, బడుగు జీవుల బతుకు చిరునామా,కోట్ల మంది ఆశాజ్యోతి.ఆ దీపాన్ని ఆర్పాలని చూసిన వాడి కళ్ళు నెత్తురు కక్కుతాయి. కాంగ్రెస్ కార్యకర్తల నరాల్లో వణుకు కాదు, అగ్ని పుడుతోంది.ఈ అవమానానికి ప్రజాస్వామ్య మార్గంలో,రాజ్యాంగబద్ధంగా, చట్టపరంగా,ప్రజాగ్రహంతో సమాధానం చెబుతాం.పాలకుల మత్తు వదిలి లేవండి. ప్రజాగ్రహం అగ్నిలా పెల్లుబుకుతుంది.చరిత్ర మిమ్మల్ని క్షమించదు.రాబోయే రోజుల్లో పాలకుల పతనం తథ్యం అని షేక్ సైదా గర్జించారు.ఈ కార్యక్రమానికి ఆయనతోపాటుగా ప్రకాశంజిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పోలు. మరియమ్మ మరియు నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

> – మహనీయుడి విగ్రహం ముక్కలు,కోట్ల ఆశలు బూడిద
>
> – తలేని విగ్రహం – చచ్చిన చట్టానికి, సిగ్గులేని పాలనకు, నిద్రపోతున్న వ్యవస్థకు, కుమ్మక్కైన కుర్చీలకు సజీవ సాక్ష్యం.



## బిసిలకు బిసి బందు పథకం పెట్టి
# ప్రతి కుటుంబానికి 20 లక్షల రూపాయలు మంజూరు చేయాలి

– రాజ్యసభ సభ్యుడు, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య

**హైదరాబాద్, మే 31 ( సాక్ష్యం న్యూస్ ) :**

జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిసిలకు " బిసి బందు పథకం " ప్రవేశ పెట్టి ప్రతి బిసి కుటుంబానికి 20 లక్షల రూపాయల ప్రకటించాలని రాజ్యసభ సభ్యుడు, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్ విద్యానగర్ బిసి భవన్ లో జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్.ర్యాగ అరుణ్ కుమార్ అధ్యక్షతన 14 బిసి సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ...బిసి కులాల అభివృద్ధికి కూడా ప్రతి బిసి కుటుంబానికి 20 లక్షల రూపాయలు మంజూరు చేస్తూ బిసి " బంధు పథకం " ప్రవేశపెట్టవలసిన ఆవశ్యకత ఉందన్నారు. బీసీ కులాలలో చాలా కులాలు అత్యంత వెనుకబడిన కులాలు ఉన్నాయని.. స్వాతంత్ర్యం లభించి 75 సంవత్సరాలు గడిచిన వీరి కుల వృత్తులు దెబ్బ తిన్నాయన్నారు. బిసి స్టడీ సర్కిల్ కు 200 కోట్లు కేటాయించాలలని, కోచింగ్ పద్దతులు మార్చాలన్నారు. అర్హులందరికీ డిఎస్సీ, పోలీస్, ఎస్ఐ, గ్రూప్–1, 2, 3,



4 సివిల్స్, బ్యాంకింగ్, రైల్వే ఇతర పోటీ పరిక్షలకు కోచింగ్ ఇవ్వాలన్నారు. కులాంతర వివాహాలు చేసుకొనే బిసి కులాల వారికి ప్రోత్సాహక పారితోషికం 2 లక్షల 50 వేలకు పెంచాలని, ఎస్సార్, ఎస్టీలకు పెంచారు... కానీ బిసిలకు పెంచలేదన్నారు. బిసి కార్పొరేషన్ కు సబ్సిడీ రుణాల కోసం రూ.20 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని, ఎంబిసి కార్పొరేషన్ కు 2 వేల కోట్లు కేటాయించాలని, 12 బిసి కులాల ఫెడరేషన్లకు జనాభా నిష్పత్తిలో 2 వేల కోట్లు కేటాయించాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ు మంజూరు చేయలేదన్నారు. రెండు సార్లు 2015లో 3 లక్షల 62 వేల దరఖాస్తులు తీసుకున్నారు... కానీ రుణాలు మంజూరు చేయలేదన్నారు. అలాగే గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు 2022లో మరోసారి సబ్సిడీ రుణాలు ఇస్తామని 5 లక్షల 77 వేల దరఖాస్తులు తీసుకున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత 2024 లో మరోసారి 6 లక్షల 80 వేల దరఖాస్తు తీసుకున్నారు. కాని రుణాలు మంజూరు చేయలేదని విమర్శించారు.బిసి కుల వృత్తులు యంత్రికరణలో దెబ్బతిన్నాయి. ప్రత్యామ్నాయంగా వీరికి కుటీర పరిశ్రమలు చిన్న తరహ పరిశ్రమలు పెట్టి ప్రోత్సహించాలి. వృత్తులు కోల్పోతున్న ఈ కులాలకు రుణాలు మంజూరు చేయాలని కోరారు. గత 13 సంవత్సరాలు తెలంగాణ పాలనాలో బీసీలకు ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి ఎలాంటి స్రీములు ప్రవేశపెట్టలేదని పేర్కొన్నారు. ఈ సంవత్సరంలో విద్యార్థుల డిమాండ్ పెద్ద ఎత్తున ఉన్నందున అదనంగా 120 బిసి గురుకుల పాఠశాలలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిసి నిరుద్యోగ జెఎసి చైర్మన్ నీల వెంకటేష్, బిసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ రాజేందర్, అనంతయ్య, బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పగిళ్ళ సతీష్, బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగోల్ల మోదీ రాందేవ్, అంజి గౌడ్, బాలయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# బాబా నగర్‌లో "మీ సురక్ష - మా భద్రత" అవగాహన కార్యక్రమం

**నాచారం, మే 31 (సాక్ష్యం):**

ప్రజల భద్రతే లక్ష్యంగా నాచారం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో బాబా నగర్‌లో "మీ సురక్ష -- మా భద్రత" అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాలనీ కమిటీ సభ్యుడు దేవ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, కాలనీ కమిటీ సభ్యులు, ఇంటి యజమానులు, నివాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







ఈ సందర్భంగా నాచారం పోలీస్ స్టేషన్ డీఐ మాట్లాడుతూ ఇంటి పనివారు, వాచ్‌మెన్‌లు, కేర్‌టేకర్లను తప్పనిసరిగా పోలీసు ధృవీకరణ చేయించుకోవాలని సూచించారు. అలాగే మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, మహిళల భద్రత, సైబర్ నేరాలు మరియు ఆన్‌లైన్ మోసాల నివారణపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఎస్ఐ మైబెల్లీ పాల్గొని ప్రజలకు భద్రతా సూచనలు అందించారు. అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల సహకారంతోనే సురక్షిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా బాబా నగర్ ప్రాంత ప్రజలు పోలీసుల సూచనలు, భద్రతా చర్యలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లునాచారం పోలీస్ స్టేషన్, మల్కాజిగిరి కమిషనరేట్ అధికారులు పేర్కొన్నారు.

# బాసర త్రిపుల్ ఐటీకి 11 మంది ఆదర్శ పాఠశాల విద్యార్థుల ఎంపిక




**మహబూబాబాద్ జిల్లా సాక్ష్యం న్యూస్ (మే31)**

మహబూబాబాద్ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల 11 మంది విద్యార్థులు బాసర త్రిపుల్ ఐటీకి ఎంపిక వీరి పేర్లు పి.కీర్తన, జి.సిరి, ఎం.జశ్వంత్, బి.అక్షయ, ఎండి.సానియా, ఏ.ప్రహర్ష, ఏ.భానుప్రకాష్, బి.చరణ్, బి.శ్రీహారిక, జె.నవ్యశ్రీ, జి.కిరణ్ కుమార్ లు బాసర త్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జి.ఉపేందర్ రావు ఈ విషయాన్ని తెలుపుతూ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. బావి తరాలకు, బంగారు భవిష్యత్తు, క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలను విద్యార్థులు చేరుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం
# సందర్భంగా సబ్ జైల్లో రిమాండ్ ఖైదీలతో ప్రతిజ్ఞ

**మహబూబాబాద్ జిల్లా**
**కరస్పాండెంట్ సాక్ష్యం న్యూస్ ( మే 31):**






మహబూబాబాద్ జిల్లాలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ స్థానిక సబ్‌జైల్లో ఆదివారం రిమాండ్ ఖైదీలకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ వి.రాజ్ కృష్ణ ఖైదీలను ఉద్దేశించి మాట్లాడుతూ,పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల కలిగే నష్టాలను,ప్రాణాంతక వ్యాధుల గురించి వివరించారు.ధూమ పానం, గుట్కా వంటి అలవాట్లు మనిషి ఆరోగ్యాన్నే కాకుండా,వారి వారి కుటుంబాలను కూడా ఆర్థికంగా,సామాజికంగా రోడ్డున పడేస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు.జైలు జీవితం అనేది ఒక పరివర్తనకు వేదిక కావాలని,ఇక్కడి నుంచి బయటకు వెళ్లేటప్పుడు చెడు అలవాట్లను వీడి,మంచి ఆదర్శవంతమైన పౌరులుగా మారాలన్నారు. విచారణ ఎదుర కొంటున్న నిందితులందరితో కలిసి పొగాకు వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. పొగాకు వంటి దుర్వ్యసనాలకు బానిసై వాటి నుంచి బయటపడాలని కోరుకునే వ్యక్తులకు ప్రభుత్వ ఆసుపత్రిలో డి అడిక్షన్ సెంటర్ తగిన సహాయం అందిస్తుందని తెలిపారు. జీవితంలో మరెప్పుడూ పొగాకు ఉత్పత్తులను ముట్టుకోబోమని,తమ కుటుంబాల క్షేమం కోసం ఆరోగ్యకరమైన జీవనాన్ని సాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# ప్రేమ పేరుతో మైనర్ బాలికపై లైంగిక దాడి

– నిందితుడి అరెస్ట్.. న్యాయస్థానానికి తరలింపు

**ఉప్పల్, మే 31 (సాక్ష్యం):**

మైనర్ బాలికను ప్రేమ పేరుతో మోసగించి లైంగిక దాడికి పాల్పడిన ఓ యువకుడిని నాచారం పోలీసులు అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మల్లాపూర్ ప్రాంతానికి చెందిన కురువ భీమేష్(24) ఓ మైనర్ బాలికను వివాహం చేసుకుంటానని నమ్మించి ఆమెపై లైంగిక దాడికి పాల్పడినట్లు బాధితురాలి తరఫున ఫిర్యాదు అందింది. ఈ మేరకు నాచారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా సాక్ష్యాధారాలను సేకరించిన పోలీసులు, నిందితుడు నేరానికి పాల్పడినట్లు నిర్ధారించుకుని ఆదివారం అతడిని అరెస్టు చేశారు. అనంతరం చట్టపరమైన ప్రక్రియలు పూర్తి చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచారు.మైనర్ బాలికలపై జరిగే లైంగిక నేరాల విషయంలో పోలీసులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారని, ఇటువంటి నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని నాచారం పోలీస్ స్టేషన్ అధికారులు తెలిపారు.



## మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ముస్లిం
# ఫకీర్ బీసీ ఈ-4 సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక

**ఉప్పల్, మే 31 (సాక్ష్యం):**

తెలంగాణ రాష్ట్ర ముస్లిం ఫకీర్ బీసీ ఈ–4 సంక్షేమ సంఘం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా నూతన కమిటీని రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీ అధ్యక్షులు మహమ్మద్ సలీం అధ్యక్షతన, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ మసూద్ అలీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు షేక్ ఫక్రుద్దీన్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ ఫరీద్ సమక్షంలో జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులుగా నాచారం బాబానగర్‌కు చెందిన మహమ్మద్ యూనూస్‌ను, ఉపాధ్యక్షులుగా మౌలాలికి చెందిన మహమ్మద్ ఖాసిం, అడ్డగుట్టకు చెందిన మహమ్మద్ ఇబ్రహీంను ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మౌలాలికి చెందిన మహమ్మద్ జాంగీర్, ప్రధాన కార్యదర్శిగా అస్మత్‌పేటకు చెందిన మహమ్మద్ షరీఫ్ బాధ్యతలు చేపట్టనున్నారు. అదేవిధంగా కార్యదర్శులుగా షాపూర్‌కు చెందిన మహమ్మద్ సలీం, వసీంలను, కోశాధికారిగా మహమ్మద్ రియాజ్‌ను నియమించారు. సలహాదారులుగా మహమ్మద్ చాంద్ పాషా, మహమ్మద్ మదార్‌లను, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎం.డి. ఖదీర్, అన్వర్, జాంగీర్‌లను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను రాష్ట్ర నాయకులు అభినందించి, ముస్లిం ఫకీర్ బీసీ ఈ–4 వర్గాల సంక్షేమం, హక్కుల సాధన కోసం సమష్టిగా కృషి చేయాలని సూచించారు. జిల్లాలో సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ సభ్యత్వ నమోదుకు కార్యాచరణ సిద్ధం

– నాచారం, హెచ్ఎంటీ నగర్ డివిజన్ల నేతలకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దిశానిర్దేశం



**ఉప్పల్, మే 31 (సాక్ష్యం):**

బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనే లక్ష్యంతో నాచారం డివిజన్, హెచ్ఎంటీ నగర్ డివిజన్‌లకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. నాచారం డివిజన్ నాయకుడు సాయిజెన్ శేఖర్, హెచ్ఎంటీ నగర్ డివిజన్ నాయకుడు మల్లికార్జున్ గౌడ్ ఆధ్వర్యంలో సికే గార్డెన్‌లో జరిగిన ఈ సమావేశానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నాచారం, హెచ్ఎంటీ నగర్ డివిజన్‌లలో గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు ప్రజల మన్ననలు పొందాయని అన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి వందల కోట్ల రూపాయల నిధులను తీసుకువచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ప్రజల్లో బీఆర్ఎస్ పార్టీకి విశేష ఆదరణ ఉందని, ఈ నేపథ్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త బాధ్యతగా తీసుకుని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి సభ్యత్వ నమోదు కీలకమని, ప్రతి ఇంటికి చేరుకుని పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఓయూలో ఘనంగా రాజమాత అహిల్యాబాయి హోల్కర్ జయంతి వేడుకలు

– అహిల్యాబాయి ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి: కొంగల పాండు కురుమ



**సికింద్రాబాద్, మే 31 (సాక్ష్యం):** ఉస్మానియా యూనివర్సిటీలో ఓయూ జేఏసీ నాయకుడు కొంగల పాండు కురుమ ఆధ్వర్యంలో పుణ్యశ్లోక రాజమాత అహిల్యాబాయి హోల్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అహిల్యాబాయి హోల్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొంగల పాండు కురుమ మాట్లాడుతూ మరాఠా సామ్రాజ్యంలో ఛత్రపతి శివాజీ తరువాత విశేష ఖ్యాతి గడించిన మహానేత అహిల్యాబాయి హోల్కర్ అని అన్నారు. దేశవ్యాప్తంగా అనేక దేవాలయాలు, చారిత్రక కట్టడాల నిర్మాణంలో ఆమె విశేష కృషి చేశారని పేర్కొన్నారు. మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ మహిళా సైన్యాలను ఏర్పాటు చేయడంతో పాటు మహిళలకు ఆర్థిక భరోసా కల్పించారని తెలిపారు. వ్యవసాయాభివృద్ధికి కృషి చేయడంతో పాటు సతీసహగమన నిర్మూలనకు చర్యలు తీసుకున్న మహోన్నత పాలకురాలిగా అహిల్యాబాయి చరిత్రలో నిలిచిపోయారని చెప్పారు. ఆమె ఆశయాలు, సేవలను ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మదాసి మదారి కురువ సంఘం నాయకులు, సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## చుక్క రక్తంతో క్యాన్సర్ గుట్టురట్టు

### నిమ్స్‌లో అత్యాధునిక వైద్యం

**హైదరాబాద్ మే 31 (సాక్ష్యం):** హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రి క్యాన్సర్ బాధితులకు అత్యాధునిక చికిత్సలను అందుబాటులోకి తెస్తోంది. నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్ సాంకేతికతతో ఇప్పటికే క్యాన్సర్ జీనోమిక్స్ సెంటర్‌ను ఏర్పాటు చేసి, కేంద్ర ప్రభుత్వ డైమండ్ ప్రాజెక్టు కింద 1,443 మందికి ఉచితంగా జన్యు పరీక్షలు నిర్వహించారు. దీని ఆధారంగా రోగులకు టార్గెటెడ్ థెరపీ అందిస్తున్నారు. దీనికి అదనంగా.. త్వరలోనే కేవలం రక్త పరీక్ష ద్వారా క్యాన్సర్‌ను గుర్తించే లిక్విడ్ బయాప్సీ సేవలను ప్రారంభించనున్నారు. ఈ ఖరీదైన పరీక్షలన్నింటినీ ఆరోగ్యశ్రీ పథకం కింద పేద రోగులకు ఉచితంగా అందించనున్నట్లు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప స్పష్టం చేశారు. హైదరాబాద్ నిమ్స్ క్యాన్సర్ వైద్య రంగంలో సరికొత్త మైలురాళ్లను అందుకుంటోంది. నానాటికీ పెరుగుతున్న క్యాన్సర్ మహమ్మారిని ప్రాథమిక దశలోనే గుర్తించి రోగులకు ఖచ్చితమైన చికిత్స అందించడమే లక్ష్యంగా నిమ్స్ యాజమాన్యం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెడుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే ఏర్పాటు చేసిన క్యాన్సర్ జీనోమిక్స్ సెంటర్ ద్వారా రోగులకు ప్రపంచస్థాయి వైద్య సేవలు అందుతున్నాయి. తాజాగా.. ఈ కేంద్రం ఆధ్వర్యంలో మరికొన్ని విప్లవాత్మక చికిత్సా విధానాలను రోగులకు అందుబాటులోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే త్వరలోనే నిమ్స్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన లిక్విడ్ బయాప్సీ సేవలను ప్రారంభించనున్నట్లు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప వెల్లడించారు. ప్రస్తుతం నిమ్స్ క్యాన్సర్ జీనోమిక్స్ సెంటర్‌లో నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్ సాంకేతికతను విజయవంతంగా వినియోగిస్తున్నారు. ఈ అత్యాధునిక టెక్నాలజీ ద్వారా క్యాన్సర్‌కు కారణమయ్యే జన్యుపరమైన లోపాలు, మార్పులను డీఎన్ఏ, ఆర్ఎన్ఏ స్థాయిల్లో అత్యంత నిశితంగా గుర్తిస్తారు. సాంప్రదాయ చికిత్సలలా కాకుండా.. ప్రతి రోగి శరీరతత్వానికి, వారి క్యాన్సర్ కణాల జన్యు నిర్మాణానికి తగినట్లుగా అందించే 'టార్గెటెడ్ థెరపీ'కి ఈ ఎన్‌జీఎస్ పరీక్షలు ఎంతో కీలకంగా





మారాయి. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డైమండ్ ప్రాజెక్టులో భాగంగా నిమ్స్ ఈ సేవలను ప్రవేశపెట్టింది. 2024 సంవత్సరం నుండి ఇప్పటివరకు దాదాపు 1,443 మంది రోగులకు ఈ అత్యంత ఖరీదైన జన్యు పరీక్షలను పూర్తిగా ఉచితంగా నిర్వహించి వారికి మెరుగైన టార్గెటెడ్ చికిత్సలను అందించినట్లు డాక్టర్ బీరప్ప వివరించారు. ఈ ఎన్‌జీఎస్ సేవలకు అదనంగా.. నిమ్స్ పాథాలజీ విభాగం ఆధ్వర్యంలో సరికొత్త లిక్విడ్ బయాప్సీ పరీక్షలను ప్రవేశపెడుతుండటం వైద్య రంగంలో ఒక పెద్ద ముందడుగుగా భావిస్తున్నారు. సాధారణంగా క్యాన్సర్ ఏ దశలో ఉందో తెలుసుకోవడానికి శరీరంలోని కణితి నుండి కొంత భాగాన్ని శస్త్రచికిత్స లేదా సూది ద్వారా సేకరించి టిష్యూ బయాప్సీ చేస్తారు. అయితే ఈ పాత పద్ధతికి భిన్నంగా కేవలం ఒక్క రక్తపు చుక్కతోనే క్యాన్సర్ ముదిరిన తీరును, దాని తీవ్రతను గుర్తించే వీలు ఈ లిక్విడ్ బయాప్సీ ద్వారా కలుగుతుందని నిమ్స్ పాథాలజీ విభాగాధిపతి డాక్టర్ శాంతవీర్ జి. ఉప్పిన్ వివరించారు. రక్తంలో ప్రవహించే క్యాన్సర్ కణాల తాలూకు డీఎన్ఏ ఆధారంగా ఈ పరీక్ష పనిచేస్తుంది. దీనివల్ల రోగి శరీరానికి ఎటువంటి గాయం లేదా శస్త్రచికిత్స చేయాల్సిన అవసరం ఉండదు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో లక్షలాది రూపాయల ఖర్చుతో కూడుకున్న ఈ ఎన్‌జీఎస్, లిక్విడ్ బయాప్సీ పరీక్షలన్నింటినీ పేద, మధ్యతరగతి రోగుల సంక్షేమం దృష్ట్యా ఆరోగ్యశ్రీ పథకం కింద పూర్తిగా ఉచితంగానే అందిస్తామని నిమ్స్ డైరెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ మద్దతుతో అందుబాటులోకి వస్తున్న ఈ అత్యాధునిక సేవలు ఎంతోమంది క్యాన్సర్ బాధితులకు పునర్జన్మను ప్రసాదించనున్నాయని చెప్పారు.

## తమిళనాడులో విజయ్‌ని చూశాక తెలంగాణలో ధైర్యం వచ్చింది: కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్ మే 31 (సాక్ష్యం):** రాజకీయాల్లో ఎన్నో పార్టీలు వస్తుంటాయని, పోతుంటాయని టీఆర్ఎస్ పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. అయితే కొన్ని పార్టీలు మాత్రమే సక్సెస్ అవుతాయని.. మరికొన్ని పార్టీలు ఫెయిల్ అవుతాయని తెలిపారు. సక్సెస్, ఫెయిల్యూర్ అయిన పార్టీలను తాము చూశామని.. ప్రజల్లోకి టీఆర్ఎస్ పార్టీ బలంగా దూసుకెళ్తోందని చెప్పారు. తమిళనాడులో విజయ్‌ని చూసిన తర్వాత తెలంగాణలో తాము అధికారంలోకి వస్తామని ధైర్యం వచ్చిందని కవిత వెల్లడించారు. తెలంగాణ రాజకీయాల్లో తెలంగాణ రక్షక సేన (టీఆర్ఎస్) పార్టీ స్థాపించిన కల్వకుంట్ల కవిత .. అధికార కాంగ్రెస్‌తోపాటు.. ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ పార్టీలపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీదే అధికారం అంటూ ఆమె ధీమా వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడులో తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ స్థాపించిన విజయ్.. తొలి ప్రయత్నంలోనే విజయం సాధించినట్లుగానే.. తెలంగాణలో కూడా టీఆర్ఎస్ పార్టీ స్థాపించిన తర్వాత తొలి ఎన్నికల్లో అధికారంలోకి వస్తుందని తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో కల్వకుంట్ల కవిత ధీమా వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి వస్తుందని.. తనకు మొదటి నుంచి నమ్మకం ఉందని తేల్చి చెప్పిన కవిత.. తమిళనాడులో విజయ్ గెలుపుతో ప్రజలకు కూడా నమ్మకం వచ్చిందని పేర్కొన్నారు. కొత్త పార్టీలకు అధికారం కట్టబెట్టాలని ప్రజలు భావిస్తున్నారని.. తన మనసులోని ఆమె మాట బయటపెట్టారు. గత 2, 3 ఏళ్లలో తాను ఎన్నో కష్టాలు ఎదుర్కొని.. అడ్డంకులు దాటినట్లు చెప్పుకొచ్చారు. అప్పుడు వేలాది మంది మద్దతుదారులు తనకు అండగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. తాను జైలులో ఉన్నప్పుడు.. బయటికి వచ్చిన తర్వాత కూడా తనను ఆదరించే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోందని.. ఏం ఇచ్చి వారి రుణం తీర్చుకోవాలో తనకు తెలియడం లేదని కవిత పేర్కొన్నారు. ఆ విధంగా తనకు మద్దతుదారులు ఉన్నారని.. వేలాది మంది టీఆర్ఎస్ పార్టీలో జాయిన్ అవుతున్నారని వెల్లడించారు. అయితే ఒకరికి మద్దతు అనేది ఊరికే రాదని.. పార్టీ పెట్టిన 10 రోజుల్లో జెండా పండగ కార్యక్రమానికి పిలుపు ఇచ్చినట్లు తెలిపారు. టీఆర్ఎస్ పార్టీలో అలాంటి కమిట్‌మెంట్ ఉన్న కార్యకర్తలు ఉన్నారని.. వారితోనే పార్టీ నిర్మాణం జరుగుతుందని తేల్చి చెప్పారు. తాను ఒక స్ట్రాంగ్ లీడర్ వద్ద ట్రైనింగ్ తీసుకున్నానని.. ఎలాంటి అపజయం వచ్చినా వెనక్కి తగ్గకుండా ఎలా ఉండాలో తెలుసని స్పష్టం చేశారు. పార్టీని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలో అవన్నీ చూసి పెరిగిన వ్యక్తిని అని తెలిపారు. పార్టీల ఫెయిల్యూర్ అయిన తర్వాత తెలంగాణ ఉద్యమం విజయం అయిందని గుర్తు చేశారు. ఓటమి చూసి నేర్చుకుంటున్నామని.. బీఆర్ఎస్ మాదిరిగా ఓడిపోకుండా పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టినట్లు కవిత వివరించారు. ఇక తెలుగు రాష్ట్రాల్లో పార్టీలు పెట్టి ఫెయిలైన నేతలు ఉన్నారని ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత వివరించారు. ఇంద్రారెడ్డి, దేవేందర్ గౌడ్, చిరంజీవి వంటి నాయకులు.. పార్టీలు పెట్టినా.. వాటిని విజయవంతంగా నడపలేకపోయారని గుర్తు చేశారు. అయితే వారేమీ చిన్న నేతలు కాదని.. అలాగే వైఎస్ షర్మిల కూడా పార్టీ పెట్టారని.. కానీ ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో విలీనం చేసినట్లు చెప్పుకొచ్చారు. కొందరు ఫెయిలైన పార్టీలను చూపించి.. తమ పార్టీ కూడా అలాగే అవుతామని చెబుతున్నారని.. అయితే అది కరెక్ట్ కాదని కొట్టిపారేశారు.

## అండర్ గ్రౌండ్ పనులపై కలెక్టర్ ఆగ్రహం సమగ్ర కార్యాచరణ ప్రణాళికకు ఆదేశం

**సూర్యాపేట జిల్లా కరస్పాండెంట్ (సాక్ష్యం న్యూస్ మే 31)** సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అండర్ గ్రౌండ్ పనుల నిర్వహణ తీరుపై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా ఐడీఓసీ కార్యాలయంలో ప్రజారోగ్య శాఖ, మున్సిపల్ అధికారులు మరియు కాంట్రాక్ట్ ఏజెన్సీ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రజారోగ్య శాఖ ఆధ్వర్యంలో 'కె.ఎన్.ఆర్ కన్‌స్ట్రక్షన్ లిమిటెడ్ సంస్థ చేపడుతున్న పనుల పురోగతిని ఈ సందర్భంగా ఆయన పరిశీలించారు. పనుల జాప్యంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పట్టణంలో యూజీడీ పనులు అత్యంత నిర్లక్ష్యపూర్వకంగా సాగుతున్నాయని మండిపడ్డారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజి పైపులు, మ్యాన్‌హోల్‌ల నిర్మాణం కోసం రోడ్లను తవ్వేసి, నెలల తరబడి వాటికి సిమెంట్ కాంక్రీట్ పనులు చేయకుండా వదిలేయడంపై ఆగ్రహం వ్యక్తం



చేశారు. దీనివల్ల సాధారణ ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ట్రాఫిక్‌కు పెద్ద ఎత్తున అంతరాయం కలుగుతోందని గుర్తుచేశారు. పైపులైన్లు, మ్యాన్‌హోల్‌ల నిర్మాణం పూర్తయిన వెంటనే తవ్విన గోతులను పూడ్చకపోవడం ముమ్మాటికీ నిర్లక్ష్యమేనని తవ్వకాల సమయంలో దెబ్బతిన్న తాగునీటి పైపులైన్లు, ఇతర ప్రజా వినియోగ సదుపాయాలను సకాలంలో పునరుద్ధరించకపోవడం వల్ల ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడాల్సి వస్తోందని కలెక్టర్ అధికారులను హెచ్చరించారు. పనుల్లో వేగం పెంచడంతో పాటు ప్రజల ఇబ్బందులను తక్షణమే తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. యూజీడీ పనులు చేపట్టిన అన్ని ప్రాంతాల్లో సీసీ రోడ్ల పునరుద్ధరణకు సంబంధించి రోడ్డు వారీగా వివరాలు, టైం లైన్ తో యాక్షన్ ప్లాన్‌ను వెంటనే సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజారోగ్య శాఖ, కాంట్రాక్ట్ ఏజెన్సీ సమన్వయంతో పనిచేసి, దెబ్బతిన్న మౌలిక వసతులను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలని, మున్సిపల్ అధికారులు కూడా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నల్గొండ ప్రజారోగ్య శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిరణ్ కుమార్, ప్రజారోగ్య శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లు అనిల్ కుమార్, రమాదేవి, కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణకు రెయిన్ అలర్ట్: నేడు జిల్లాల్లో వర్షాలకు ఛాన్స్

**హైదరాబాద్ మే 31 (సాక్ష్యం):** తెలంగాణలో పగటిపూట తీవ్రమైన ఎండలు, సాయంత్రానికి అకస్మాత్తుగా ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తూ భిన్నమైన వాతావరణం నెలకొంది. జూన్ 6 వరకు రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాలకు అలర్ట్ జారీ చేసింది. అకాల వర్షాల వల్ల కల్లాల్లోని ధాన్యం కొట్టుకుపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. మరోవైపు పగటి ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల పైనే నమోదవుతున్నాయి. గత ఐదేళ్లలో ఈ ఏడాదే అత్యధికంగా వడగాలుల మరణాలు సంభవించాయి. రుతుపవనాల రాకకు మరో పది రోజులకు పైగా సమయం పట్టే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. తెలంగాణలో ప్రస్తుతం విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. పగలంతా భానుడి భగభగలతో నిప్పుల కొలిమిని తలపిస్తున్న వాతావరణం.. సాయంత్రం కాగానే ఒక్కసారిగా మారిపోతోంది. ఎటువంటి ముందస్తు సంకేతాలు లేకుండానే ఆకాశం మేఘావృతమై.. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో వీస్తున్న ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఈ వింత వాతావరణ మార్పులు సాధారణ ప్రజలతో పాటు ముఖ్యంగా అన్నదాతలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇటీవల కాలంలో కురిసిన అకాల భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వ్యవసాయ రంగానికి తీరని నష్టం వాటిల్లింది. చేతికొచ్చిన పంట దిగుబడులు కళ్లముందే వరదపాలు కావడం రైతులను కలచివేస్తోంది. మార్కెట్ యార్డులు, కల్లాలు, రవాణా కోసం వాహనాలలో నింపిన ధాన్యం సైతం తడిసి ముద్దయింది. తగినన్ని రక్షణ చర్యలు తీసుకునే లోపే ప్రకృతి ప్రకోపించడంతో పండించిన పంట వానపాలై తీవ్ర ఆర్థిక నష్టాన్ని మిగిల్చింది. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపరిహారం అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో ఈనెల 6 వరకు కూడా ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్ద ఆశ్రయం పొందవద్దని అధికారులు సూచించారు. నేడు రంగారెడ్డి, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని అన్నారు. కాగా, ఒకవైపు వర్షాలు పడుతున్నప్పటికీ.. పగటిపూట ఎండల తీవ్రత ఏమాత్రం తగ్గడం లేదు. ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, నల్గొండతో పాటు దాదాపు 16 జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల సెల్సియస్‌కు పైగా నమోదవుతున్నాయి. గత ఆదివారం ఖమ్మం రూరల్ మండలంలో అత్యధికంగా 45.2 డిగ్రీల ఉష్ణోగ్రత



నమోదైంది. ములుగు జిల్లాలోని పలు మండలాల్లో తీవ్రమైన వడగాలులు వీచాయి. రానున్న మూడు, నాలుగు రోజుల పాటు ఇదే రకమైన గరిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతాయని ఐఎండీ స్పష్టం చేసింది. గత ఐదేళ్లతో పోలిస్తే ఈ ఏడాది వేసవి కాలం రాష్ట్రాన్ని అతలాకుతలం చేసింది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో రికార్డు స్థాయిలో 46.5 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ ఉష్ణోగ్రతల కారణంగా రాష్ట్రంలో వడదెబ్బ మరణాల సంఖ్య కూడా ఈ ఏడాది గణనీయంగా పెరిగినట్లు అంచనా వేస్తున్నారు. జూన్ మొదటి వారంలో వానాకాలం ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ.. నైరుతి రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకడానికి మరో 10 రోజులకు పైగా సమయం పట్టేలా ఉంది. జూన్ 6 తర్వాతే వాతావరణం కొంత చల్లబడే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## బొల్లారం మహిళ హత్య కేసులో భార్యను చంపిన భర్త

**హైదరాబాద్ మే 31 (సాక్ష్యం):** బొల్లారంలో సంచలనం సృష్టించిన మహిళ హత్య కేసులో బిగ్ ట్విస్ట్ చోటు చేసుకుంది. ఆ మహిళ భర్తే ఆమెను హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. మొదట గుర్తు తెలియని వ్యక్తులు తన భార్యను గొంతు కోసి హత్య చేశారని భర్త ఫిర్యాదు చేయగా.. రంగంలోకి దిగి విచారణ చేపట్టిన పోలీసులకు భర్త తీరు అనుమానాస్పదంగా కనిపించింది. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా.. అసలు విషయం బయటపెట్టాడు. హైదరాబాద్‌లో జరిగిన మహిళ హత్య కేసులో కీలక పరిణామం చేటు చేసుకుంది. సికింద్రాబాద్ పరిధిలోని బొల్లారంలో మహిళను దుండగులు హత్య చేశారని భావించగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసిన పోలీసులకు సంచలన విషయాలు తెలిశాయి. భర్తే భార్యను అతి కిరాతకంగా హత్య చేసి.. ఆ తర్వాత దాన్ని గుర్తు తెలియని వ్యక్తులు చేశారని అందర్నీ నమ్మించే ప్రయత్నం చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. దీంతో పోలీసులు మృతురాలి భర్తను గట్టిగా విచారణ చేయగా.. తానే హత్య చేసినట్లు జరిగిన విషయం మొత్తం చెప్పాడు. ఈ నేపథ్యంలోనే అసలు భార్యను హత్య చేయడానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. అనిల్, మీనా అనే దంపతులు బొల్లారంలో గత 20 ఏళ్లుగా నివాసం ఉంటున్నారు. శనివారం రోజున రాత్రి బొల్లారం పరిధిలోని నిర్మానుష ప్రాంతంలో మీనా అనే మహిళ దారుణ హత్యకు గురైంది. గుర్తుతెలియని వ్యక్తులు తమపై దాడి చేసి తన భార్యను గొంతుకోసి చంపేశారని ఆమె భర్త అనిల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన భార్యను కాపాడేందుకు తాను అడ్డువెళ్లగా.. తనపై కూడా





ఆ దుండగులు కత్తితో దాడి చేశారని పోలీసులకు వెల్లడించాడు. మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు కొనుగోలు చేసి తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగినట్లు చెప్పాడు. ఈ క్రమంలోనే మీనా భర్త అనిల్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. మీనా హత్య చేసింది దుండగులు కాదని.. ఆమె కట్టుకున్న భర్త అనిలేనని వెల్లడైంది. మీనా హత్యకు సంబంధించి.. ఆమె భర్త అనిల్ పోలీసులకు చెప్పిన విషయాలు పొంతన లేకపోవడంతో.. అతడిపైనా వారికి అనుమానం వచ్చింది. దీంతో అనిల్‌ను తమ స్టైల్‌లో విచారణ చేయగా అసలు నిజం బయటికొచ్చింది. అసలు తన భార్య మీనాను భర్త అనిల్ ఎందుకు హత్య చేశాడు అనే కోణంలో ఇప్పుడు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మీనా, అనిల్ దంపతులు బొల్లారంలోని వెంకటేశ్వర కాలనీలో నివాసం ఉంటున్నారని తెలుస్తోంది. అయితే వారిద్దరి మధ్య ఎలాంటి గొడవలు లేవని ఇరుగు పొరుగు వారు చెబుతున్నారు. అయితే వారు ఈ మధ్యే కొత్త ఇల్లు కూడా కట్టుకున్నారని.. ఇలాంటి సమయంలో మీనా హత్య జరగడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. అయితే మీనాను ఎందుకు అనిల్ హత్య చేయాల్సి వచ్చింది అనేది అతడి నుంచే రాబట్టే పనిలో పోలీసులు ఉన్నారు. ప్రస్తుతం అనిల్ పోలీసుల అదుపులోనే ఉండగా.. విచారణలో హత్యకు సంబంధించిన మరిన్ని విషయాలు వెలుగులో రానున్నాయని పోలీసులు చెబుతున్నారు.

## 'నీ ఏడుపే బీజేపీకి శాపం' ఈటలకు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు

**హైదరాబాద్ మే 31 (సాక్ష్యం):** బీజేపీలో అంతర్గత పోరు మరోసారి బహిర్గతం అయింది. ఈటల రాజేందర్‌కు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు అంటించడం తీవ్ర కలకలం రేపుతోంది. ఈటల రాజేందర్‌కు బీజేపీలో ఎన్నో అవకాశాలు ఇచ్చినప్పటికీ.. ఆయన మాత్రం తన సొంత ఇమేజ్ ఉందని చెప్పుకుంటున్నారని ఆ ఫ్లెక్సీల్లో పేర్కొన్నారు. అయితే ఈ ఫ్లెక్సీలను ఎవరు ఏర్పాటు చేశారు, దీని వెనుక ఎవరు ఉన్నారనే చర్చ జరుగుతోంది. ఈ వ్యవహారంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు స్పందించారు. తెలంగాణ బీజేపీలో విబేధాలు తారస్థాయికి చేరుకున్నట్లు తెలుస్తోంది. గత కొన్ని రోజులుగా పాత నేతలు, కొత్త నేతల మధ్య గ్యాప్ ఉందంటూ వార్తలు వస్తున్న వేళ.. తాజాగా కీలక పరిణామం చోటు చేసుకుంది. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌ను టార్గెట్ చేస్తూ.. ఫ్లెక్సీలు వెలియడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మేడ్చల్ ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డుపై ఈ ఫ్లెక్సీలు అంటించి ఉండటం గమనార్హం. ఆ ఫ్లెక్సీలు సోషల్ మీడియాలో తెగ వైరల్ కావడం, వార్తలు చక్కర్లు కొట్టడంతో.. బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు రియాక్ట్ అయ్యారు. ఆ ఫ్లెక్సీల్లో ఈటల రాజేందర్ లక్ష్యంగా రాతలు ఉండటం గమనార్హం. 'నీ ఏడుపే బీజేపీకి శాపం' అనే హెడ్డింగ్‌తో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో ఈటల రాజేందర్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష పదవి రాలేదని.. ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించలేదని.. కేంద్రమంత్రి పదవి దక్కలేదని ఈటల రాజేందర్ అసంతృప్తి వ్యక్తం





చేస్తున్నారంటూ ఆ ఫ్లెక్సీల్లో పేర్కొన్నారు. ఈటల రాజేందర్‌కు 2 చోట్ల ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించడంతో పాటు.. రెండు చోట్ల ఓడిపోయిన తర్వాత కూడా మల్కాజ్‌గిరి ఎంపీ టికెట్ కూడా ఇచ్చింది బీజేపీ పార్టీనేనని గుర్తు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గెలుపొందిన తర్వాత కూడా.. తన ఇమేజ్‌తోనే గెలిచాను అని ఈటల రాజేందర్ చెప్పడం రాజకీయ నైతికత కాదని ఆ ఫ్లెక్సీల్లో విమర్శలు గుప్పించారు. అదే సమయంలో బీసీ నాయకుడు ఎదుగుతుంటే అసహనం ఎందుకని.. ఎంపీ ధర్మపురి అరవింద్‌కు లభిస్తున్న ఆదరణను చూసి కడుపుమంట ఎందుకని అందులో ప్రశ్నించారు. తాను బీసీ నాయకుడిని.. తానే ప్రత్యామ్నాయం అనే భావన నుంచి బయటకు రావాలని ఈటల రాజేందర్‌కు సూచిస్తూ ఫ్లెక్సీల్లో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ ఫ్లెక్సీలకు సంబంధించిన ఫోటోలు మీడియా, సోషల్ మీడియాలో వైరల్ కావడంతో.. అసలు వాటిని ఎవరు ఏర్పాటు చేశారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడానికి వెనుక ఉద్దేశం ఏంటి అనేది ఇప్పుడు చర్చకు దారి తీస్తోంది. ఈ ఫ్లెక్సీల వ్యవహారం రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపుతున్న వేళ.. తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు స్పందించారు. తెలంగాణలో రోజురోజుకూ బీజేపీ బలం పెరుగుతోందని ఓర్వలేక ఇతర పార్టీలకు చెందిన నేతలు, బయటి వ్యక్తులు ఇలాంటి పనులు చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీలో ఎలాంటి విభేదాలు లేవని తేల్చి చెప్పారు. తమ పార్టీ నేతల మధ్య వివాదాలు రేపాలని కుట్రలు చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. ఈటల రాజేందర్‌కు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వారిపై డీజీపీకి ఫిర్యాదు చేస్తామని తీవ్ర హెచ్చరికలు చేశారు. తెలంగాణ బీజేపీ నేతలు కలిసికట్టుగా ఐక్యంగా పనిచేస్తున్నారని.. అందుకే పార్టీ గ్రాఫ్ పెరిగిందని తేల్చి చెప్పారు.




# అదరహో ఆర్సీబీ..

## ఐపీఎల్ 2026 విజేతగా ఆర్సీబీ..

- అద్వితీయమైన ప్రదర్శనతో టైటిల్ సొంతం
- వరుసగా రెండో టైటిల్‌ను ముద్దాడిన బెంగళూరు
- 5 వికెట్ల తేడాతో గుజరాత్ టైటాన్స్‌పై గెలుపు



ఐపీఎల్ 2026 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) విజేతగా నిలిచింది. అద్వితీయమైన ప్రదర్శనతో డిఫెండింగ్ ఛాంపియన్‌గా టైటిల్ నిలబెట్టుకుంది. సమష్టి ప్రదర్శనతో అసాధారణమైన విజయాన్ని సొంతం చేసుకుంది. విరాట్ కోహ్లీ విజయ గర్జనతో ఆర్సీబీ వరుసగా రెండో టైటిల్‌ను ముద్దాడింది. అహ్మదాబాద్ వేదికగా ఆదివారం ఏకపక్షంగా సాగిన ఫైనల్లో సమష్టిగా రాణించిన ఆర్సీబీ 5 వికెట్ల తేడాతో గుజరాత్ టైటాన్స్‌ను ఓడించింది. పేలవ బ్యాటింగ్‌తో టైటిల్ గెలుచుకునే సువర్ణవకాశాన్ని గుజరాత్ టైటాన్స్ చేజార్చుకుంది. ప్లే ఆఫ్స్‌లో నాలుగు మ్యాచ్‌లకు నాలుగు ఏకపక్షంగానే ముగియడం అభిమానులను తీవ్రంగా నిరాశపర్చింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 155 పరుగులే చేసింది. వాషింగ్టన్ సుందర్(37 బంతుల్లో 5 ఫోర్లతో 50 నాటౌట్) ఒక్కడే అజేయ హాఫ్ సెంచరీతో రాణించగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యరు.

ఆర్సీబీ బౌలర్లలో రసిక్ సలామ్(3/27) మూడు వికెట్లు తీయగా.. భువనేశ్వర్ కుమార్, జోష్ హేజిల్‌వుడ్ రెండేసి వికెట్లు తీసారు. కృనాల్ పాండ్యాకు ఒక వికెట్ దక్కింది. అనంతరం ఆర్సీబీ 18 ఓవర్లలో 5 వికెట్లకు 161 పరుగులు చేసి గెలుపొందింది. విరాట్ కోహ్లీ(42 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లతో 75 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించగా.. వెకంటేశ్ అయ్యర్(16 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 32) పర్వాలేదనిపించాడు. గుజరాత్ టైటాన్స్ బౌలర్లలో రషీద్ ఖాన్ రెండు వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్, కగిసో రబాడ, అర్షద్ ఖాన్ చెరో వికెట్ పడగొట్టారు. 154 పరుగుల లక్ష్యఛేదనలో ఆర్సీబీ దూకుడుగా తమ ఇన్నింగ్స్‌ను ప్రారంభించింది. ఓపెనర్లు విరాట్ కోహ్లీ, వెంకటేశ్ అయ్యర్ పోటాపడి బౌండరీలు బాదారు. కగిసో రబాడ వేసిన రెండో ఓవర్‌లో మూడు ఫోర్లు, రెండు సిక్స్‌లు బాదిన ఈ జోడీ.. సిరాజ్ వేసిన నాలుగో ఓవర్‌లో మూడు ఫోర్లు, ఒక సిక్సర్ కొట్టింది. దూకుడుగా ఆడిన వెంకటేష్ అయ్యర్‌ను మహమ్మద్ సిరాజ్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో తొలి వికెట్‌కు నమోదైన 62 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. దేవదత్ పడిక్కల్(1) తీవ్రంగా నిరాశపర్చగా.. రజత్ పాటిదార్ ఫోర్, బౌండరీతో దూకుడు కనబర్చాడు. కానీ రషీద్ ఖాన్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడబోయి క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. అదే ఓవర్‌లో కృనాల్ పాండ్యా కూడా ఔటవ్వడంతో మ్యాచ్ కాస్త ఉత్కంఠగా మారింది. కానీ కింగ్ కోహ్లీ.. టీమ్ డేవిడ్ సాయంతో జట్టును విజయంవైపు నడిపించాడు. ఈ క్రమంలో కోహ్లీ 25 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 41 పరుగుల కీలక భాగస్వామ్యంతో క్రీజులో సెట్ అయిన ఈ జోడీని అర్షద్ ఖాన్ విడదీసాడు. టీమ్ డేవిడ్(24)ను అర్షద్ ఖాన్ ఔట్ చేయగా.. జితేష్ శర్మతో కలిసి విరాట్ కోహ్లీ విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు. ఈ మ్యాచ్‌లో బ్యాటింగ్ వైఫల్యం గుజరాత్ టైటాన్స్ పతనాన్ని శాసించింది. సీజన్ ఆసాంతం రాణించిన గుజరాత్ టాప్-3 బ్యాటర్లు(గిల్,సుదర్శన్, జోస్ బట్లర్) ఈ మ్యాచ్‌లో చేతులెత్తే సారు. వాషింగ్టన్ సుందర్ అజేయ హాఫ్ సెంచరీతో ఒంటరి పోరాటం చేసినా ఇతర బ్యాటర్ల నుంచి సహకారం లభించలేదు. దాంతో గుజరాత్ టైటాన్స్ స్వల్ప స్కోర్‌కే పరిమితమై ఓటమికి తల వంచింది. సాఫీగా సాగుతున్న ఆర్సీబీ ఛేజింగ్ లో 9వ ఓవర్లో కుదుపు వచ్చింది. ముందుగా రషీద్ బౌలింగ్ లో భారీ షాట్ కు ప్రయత్నించి, పాటిదార్ ఔటయ్యాడు. ఇదే ఓవర్లో స్వీప్ షాట్ కు ప్రయత్నించి, క్రునాల్ పాండ్యా (1) కావడంతో జీటీ పునరాగమనం చేస్తోందని అంతా భావించారు. ఈ దశలో టిమ్ డేవిడ్ (24) తో కలిసి అద్భుత భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఈ క్రమంలో 25 బంతుల్లోనే కోహ్లీ ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. మధ్యలో డేవిడ్ వెనుదిరిగినా, జితేశ్ శర్మ (11 నాటౌట్) తో కలసి కోహ్లీ మ్యాచ్ ను ముగించాడు. దీంతో ఆర్సీబీని వరుసగా రెండోసారి చాంపియన్ గా నిలబెట్టాడు.

## ఐపీఎల్ చరిత్రలో వైభవ్ సూర్యవంశీ

# అరుదైన ఘనత

రాజస్థాన్ రాయల్స్ ఐపీఎల్ 2026 నుంచి ఫైనల్‌కు ముందే నిష్క్రమించినప్పటికీ టీనేజ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ రికార్డులు సృష్టిస్తూనే ఉన్నాడు. ఐపీఎల్ చరిత్రలో ఆరెంజ్ క్యాప్ గెలుచుకున్న అత్యంత పిన్న వయస్కుడైన బ్యాటర్‌గా వైభవ్ నిలిచాడు. గుజరాత్ టైటాన్స్‌కు చెందిన శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్ అత్యంత సమీపానికి వచ్చినా 700 మార్క్ దాటినా ఫైనల్లో విఫలం కావడంతో ఆరెంజ్ క్యాప్ బుడ్డోడి సొంతమైంది. కీలకమైన మ్యాచులో కోహ్లీ కేవలం 26 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేశాడు. అతను వైభవ్ కంటే 176 పరుగులు వెనుకబడి ఉన్నాడు. ఐపీఎల్‌లో వైభవ్ సూర్యవంశీకి ఇది రెండవ సీజన్ మాత్రమే. ఐపీఎల్ 2026లో 16 మ్యాచ్‌లు ఆడిన వైభవ్ సూర్యవంశీ 48.50 సగటుతో 776 పరుగులు చేశాడు. ఈ సీజన్ మొత్తంలో వైభ్ ఒక సెంచరీ, 5 హాఫ్ సెంచరీలు చేశాడు. వైభవ్ రెండు నాకౌట్ మ్యాచులలో తృటిలో సెంచరీలు చేసే అవకాశాన్ని కోల్పోయాడు.



ఫైనల్‌లో జీటీ ఓపెనర్ బ్యాట్స్‌మెన్లు త్వరగానే అవుట్ అయ్యారు. వైభవ్ సూర్యవంశీ కేవలం 15 సంవత్సరాల వయస్సులోనే ఆరెంజ్ క్యాప్ గెలుచుకున్న అరుదైన ఘనతను సాధించాడు. జోస్ బట్లర్ తర్వాత రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడుతూ ఆరెంజ్ క్యాప్‌ను కైవసం చేసుకున్న రెండవ బ్యాటర్ అతడే. బట్లర్ 2022 సీజన్‌లో రాజస్థాన్ జట్టుకు ఆడుతూ ఆరెంజ్ క్యాప్ సాధించాడు. ఐపీఎల్ 19 ఏళ్ల చరిత్రలో ఆరెంజ్ క్యాప్ గెలుచుకున్న అత్యంత పిన్న వయస్కుడైన బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ. కేవలం సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్ లలో ఒకరు ఫైనల్లో భారీ స్కోరు చేస్తే వైభవ్‌ను వెనక్కి నెట్టేవారు. కానీ ఆదివారం రాత్రి జరిగిన ఐపీఎల్ ఫైనల్‌లో గిల్ కేవలం 10 పరుగులు మాత్రమే చేయగా, సుదర్శన్ 12 పరుగులు చేశాడు. వారు అవుట్ అవ్వగానే వైభవ్ ఆరెంజ్ క్యాప్ ఖాయమైపోయింది. వారి తర్వాత అత్యధిక పరుగులు చేసిన వారి జాబితాలో విరాట్ కోహ్లీ ఉన్నాడు. ఈ ఎలిమినేటర్ లో సన్‌రైజర్స్ మీద 97 పరుగులు చేసిన వైభవ్ సూర్యవంశీ, క్వాలిఫయర్ 2లో గుజరాత్ టైటాన్స్ మీద 96 పరుగులు చేసి సెంచరీ చేజార్చుకున్నాడు. విరాట్ కోహ్లీ సైతం 700 పరుగుల మార్క్ చేరలేకపోయాడు. 15 ఏళ్ల క్రికెట్ సంచలనం వైభ్ ఒకే సీజన్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన రికార్డును బద్దలు కొట్టాడు. ఐపీఎల్ 2026లో ఈ లెఫ్ట్ హ్యాండర్ బ్యాటర్ 72 సిక్సర్లు బాదాడు. అంతకుముందు ఒకే సీజన్‌లో అత్యధిక సిక్సర్ల రికార్డు క్రిస్ గేల్ పేరిట ఉండేది. 2012 సీజన్‌లో యూనివర్సల్ బాస్ గేల్ 59 సిక్సర్లు కొట్టాడు. ఆదివారం రాత్రి జరిగిన ఐపీఎల్ ఫైనల్లో ఫస్ట్ బ్యాటింగ్ కు దిగిన జీటీ నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 155 రన్స్ చేసింది. విరాట్ కోహ్లీ హాఫ్ సెంచరీ (75 నాటౌట్)తో రాణించడంతో 5 వికెట్ల తేడాతో ఆర్సీబీ టార్గెట్ ఛేదించి వరుసగా రెండో ఏడాది ఐపీఎల్ విజేతగా నిలిచింది.

## షమీ పవర్ ప్లే రికార్డ్ భువనేశ్వర్ సమం..

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సీనియర్ ఫాస్ట్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ ఐపీఎల్ 2026 సీజన్ లో తన అద్భుతమైన ఫామ్ ను కంటిన్యూ చేస్తూ ఆదివారం మరో మైలురాయిని అందుకున్నాడు. అహ్మదాబాద్ లో గుజరాత్ టైటాన్స్ టీమ్ తో జరుగుతున్న టైటిల్ ఫైట్ లో అతడు ఒక హిస్టారికల్ రికార్డును సమం చేశాడు. ఈ ఫైనల్ మ్యాచ్ లో నాలుగో ఓవర్ లోనే గుజరాత్ ఓపెనర్ సాయి సుదర్శన్ ను అవుట్ చేయడం ద్వారా భువనేశ్వర్ ఈ రికార్డును టచ్ చేశాడు. ఈ మ్యాచ్ లో గుజరాత్ కు ఈ వికెట్ పెద్ద షాక్ అని చెప్పాలి. ఈ సీజన్ లో ఆల్రెడీ 700 రన్స్ మైలురాయిని దాటిన శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్ ల జోడీని విడదీయడం ఆర్సీబీకి చాలా అవసరమైంది. మ్యాచ్ స్టార్టింగ్ లోనే జోష్ హేజిల్‌వుడ్ సూపర్ బాల్ తో గిల్ (10) ను అవుట్ చేసి గుజరాత్ ను ప్రెజర్ లోకి నెట్టాడు. ఆ వెంటనే భువనేశ్వర్ పర్ఫెక్ట్ షార్ట్ పిచ్ ప్లాన్ తో సుదర్శన్ ను ట్రాప్ చేశాడు. భువి వేసిన షార్ట్ బంతిని సుదర్శన్ పుల్ షాట్ ఆడటానికి ట్రై చేశాడు. కానీ బౌన్స్ ను అంచనా వేయడంలో ఫెయిల్ అవ్వడంతో బంతి గాల్లోకి లేచింది. వికెట్ కీపర్ జితేష్ శర్మ ముందుకు పరుగెత్తుకుంటూ వచ్చి పర్ఫెక్ట్ క్యాచ్ అందుకోవడంతో సుదర్శన్ ఇన్నింగ్స్ ముగిసింది. ఈ వికెట్ తో గుజరాత్ టైటాన్స్ పవర్ ప్లే ముగిసేసరికి 45 రన్స్ కే 2 వికెట్లు కోల్పోయి తీవ్ర ఇబ్బందుల్లో పడింది. స్ట్రోక్ ప్లే కి అంతగా సహకరించని ఈ పిచ్ పై ఆర్సీబీ బౌలర్లు మ్యాచ్ పై పట్టు సాధించారు. ఈ సీజన్ లో ఆర్సీబీ బ్యాటింగ్ యూనిట్ పైనే అందరి ఫోకస్ ఉన్నా, భువనేశ్వర్ తన ఎక్స్‌పీరియన్స్ తో టీమ్ కు ఎప్పటికప్పుడు బ్రేక్‌త్రూలు ఇస్తూ సాలిడ్ పర్ఫార్మెన్స్ ఇచ్చాడు. సాయి సుదర్శన్ వికెట్ తీయడంతో భువనేశ్వర్ కుమార్ ఈ సీజన్ లో టోటల్ గా 28 వికెట్లకు చేరుకున్నాడు. దీంతో అత్యధిక




వికెట్లు తీసిన బౌలర్ల లిస్టులో గుజరాత్ టైటాన్స్ పేసర్ కాగిసో రబడాతో కలిసి సంయుక్తంగా టాప్ ప్లేస్ కు చేరి పర్పుల్ క్యాప్ రేసును ఇంట్రెస్టింగ్ గా మార్చాడు. ఒకే ఐపీఎల్ సీజన్ లో అత్యధిక పవర్ ప్లే వికెట్లు తీసిన ఓవరాల్ రికార్డులో కాగిసో రబడా (2026 లో 20 వికెట్లు) టాప్ లో ఉన్నాడు. ఆ తర్వాత షమీ, భువి చెరో 17 వికెట్లతో సెకండ్ ప్లేస్ లో నిలిచారు. మరోవైపు ఈ సీజన్ లో 29 వికెట్లు తీసిన రబాడా.. పర్పుల్ క్యాప్ ను అందుకున్నాడు.

సీజన్ పవర్ ప్లే (1-6 ఓవర్లు) లో తన 17వ వికెట్ ను ఖాతాలో వేసుకున్నాడు. దీంతో ఒకే ఐపీఎల్ సీజన్ లో అత్యధిక పవర్ ప్లే వికెట్లు తీసిన ఇండియన్ బౌలర్ గా మహమ్మద్ షమీ పేరిట ఉన్న లాంగ్ స్టాండింగ్ రికార్డును భువి అందుకున్నాడు. గతంలో గుజరాత్ టైటాన్స్ టీమ్ తరఫున ఆడుతూ ఐపీఎల్ 2023 సీజన్ లో షమీ పవర్ ప్లే లో 17 వికెట్లు పడగొట్టి ఈ బెంచ్‌మార్క్ క్రియేట్ చేశాడు. సరిగ్గా మూడేళ్ల తర్వాత భువనేశ్వర్ కుమార్ ఐపీఎల్ ఫైనల్ లాంటి బిగ్గెస్ట్ స్టేజ్ పై ఆ

## ముంబైపై విజయంతో మాకు ఊపొచ్చింది : విరాట్ కోహ్లీ

లీగ్ దశలో కాస్త తడబడినా.. ముంబై ఇండియన్స్‌పై ఉత్కంఠపోరులో విజయం సాధించడం తమ ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసిందని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అన్నాడు. గతేడాది ఉన్నంత ఒత్తిడి ఈసారి లేదని చెప్పాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో ఆర్సీబీ విజేతగా నిలిచింది. ఆదివారం అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఫైనల్లో సమష్టిగా రాణించిన ఆర్సీబీ 5 వికెట్ల తేడాతో గుజరాత్ టైటాన్స్‌ను ఓడించింది. ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ(42 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లతో 75 నాటౌట్) మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన కనబర్చాడు. ఈ విజయానంతరం అధికారిక బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడిన విరాట్ కోహ్లీ.. తమ ఆటగాళ్లపై ప్రశంసల జల్లు కురిపించాడు.



'గతేడాది ఉన్నంత ఒత్తిడి ఈసారి లేదని నేను మా జట్టులోని కొందరు ఆటగాళ్లతో అన్నాను. మా గ్రూప్‌లో ఎలాంటి ప్రతిభ ఉందో మాకు బాగా తెలుసు. మేం పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచాం. ఫైనల్‌కు అందరికంటే ముందు చేరడానికి ఒక బలమైన కారణం ఉంది. మేం జట్టుతో ఒకటే చెప్పాం. మనం మన సహజసిద్ధమైన క్రికెట్‌ను నమ్ముకుని, మన ప్లాన్స్‌ను సరిగ్గా అమలు చేస్తే.. ఈ టోర్నమెంట్‌లోనే మనది అత్యుత్తమ జట్టుగా నిలుస్తుందన్నాం. గ్రూప్ స్టేజ్‌లో మేం అంత బాగా రాణించడానికి కారణం ఇదే. అందుకే లీగ్ స్టేజ్‌ను టాపర్స్‌గా ముగించాం. మా ఆటగాళ్ల నైపుణ్యాలు, వారిలోని పరిణతి , ఒత్తిడిని తట్టుకునే మానసిక స్థిరత్వం ఈ రాత్రి మరోసారి మైదానంలో స్పష్టంగా కనిపించాయి. ఇది నిజంగా ఒక అద్భుతమైన సమష్టి ప్రదర్శన. నిజం చెప్పాలంటే.. బ్రేక్ తర్వాత మేం ఒకటి రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయాం. అంటే, ఒక మ్యాచ్ ఓడిపోయాక ముంబై ఇండియన్స్‌పై చాలా క్లోజ్ మ్యాచ్‌లో గెలిచాం. ఆ వారం మాకు కొంచెం కష్టంగా అనిపించింది. ఎందుకంటే మేం పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానంలో నిలవాలని బలంగా కోరుకున్నాం. అయితే ముంబై ఇండియన్స్‌పై ఉత్కంఠ పోరులో గెలిచిన తర్వాత మా ఆత్మవిశ్వాసం రెట్టింపు అయ్యింది. ఆ తర్వాత కేకేఆర్‌పై చాలా భారీ విజయాన్ని నమోదు చేశాం. టేబుల్ టాపర్స్‌గా నిలిచి ఇప్పుడు మళ్లీ టైటిల్ అందుకున్నాం. మాది అద్భుతమైన జట్టు. ఇలాంటి విజయం కోసం మేం చాలా ఏళ్లు వేచి చూశాం. మైదానంలోకి అడుగుపెట్టినప్పుడు ప్రతిసారీ మనమే ఒంటరిగా జట్టును గెలిపించాల్సిన అవసరం లేదనే భావన కలిగించే ఆటగాళ్లు చుట్టూ ఉండటం చాలా గొప్ప విషయం. మ్యాచ్‌లను ఒంటిచేత్తో గెలిపించగల ఆటగాళ్లు మీ పక్కన, మీ వెనుక ఉన్నారు. మా జట్టులో ఎంతో మంది విభిన్న ఆటగాళ్లకు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డులు రావడం దీనికి నిదర్శనం. మా హేజిల్‌వుడ్, భువి, జాకబ్ డఫీ లాంటి ప్రపంచ స్థాయి బౌలింగ్ లైనప్ ఉంది. ఇక కృనాల్ పాండ్యా విషయానికి వస్తే.. అతను ఎప్పటిలాగే ఎంతో నమ్మదగిన ఆటగాడిగా నిలిచాడు. రసిఖ్ దార్ ఈ సీజన్‌లో అద్భుతంగా బౌలింగ్ చేశాడు. అలాగే బ్యాటర్లందరూ కూడా తమ వంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించారు. సరైన సమతుల్యత, తిరుగులేని బలం ఉన్న ఇలాంటి ఆల్‌రౌండ్ స్ట్రాంగ్ టీమ్‌లో ఆడటం నాకు ఎంతో సంతోషాన్ని ఇస్తోంది. అందుకే ప్రస్తుతం మైదానంలో మేం సత్తా చాటుతున్నాం.'అని విరాట్ కోహ్లీ చెప్పుకొచ్చాడు.

# పెద్ది' కోసం రెండేళ్ళు చాలా ఇష్టంతో కష్టపడ్డాం

## పెద్ది తప్పకుండా ఇండస్ట్రీ గర్వపడేలా చేస్తుంది: చెన్నై ప్రెస్ మీట్ లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్ డ్రామా 'పెద్ది' దేశవ్యాప్తంగా హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. ఈ చిత్రం ఇప్పటికే అద్భుతమైన గ్లింప్స్, రెండు చార్ట్ బస్టర్ పాటలు, పవర్ ఫుల్ థియేట్రికల్ ట్రైలర్‌తో ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తోంది. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. పెద్ది జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదల కానుంది. జూన్ 3న ప్రత్యేక ప్రీమియర్‌లు ప్రదర్శించనున్నారు. ఈ నేపథ్యంలో చిత్ర బృందం చెన్నైలో గ్రాండ్ ప్రెస్ మీట్ నిర్వహించింది. చెన్నై ప్రెస్ మీట్ లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మాట్లాడుతూ.. చెన్నై మీడియాకు నమస్కారం. 'మగధీర', 'ఆర్ఆర్ఆర్' చిత్రాల ప్రమోషన్స్ కోసం చెన్నైకి వచ్చాను. ఇక్కడికి ఎప్పుడు వచ్చినా నాకు సొంత ఇంటికి వచ్చిన ఫీలింగ్ కలుగుతుంది. 'పెద్ది' కోసం మేమంతా రెండున్నరేళ్లు కష్టపడ్డాం. నేను 285 రోజులు షూటింగ్‌లో పాల్గొన్నాను. డైరెక్టర్ బుచ్చిబాబు ఈ సినిమా కోసం దాదాపు ఐదేళ్లు శ్రమించారు. ఈ సినిమాకు బిగ్గెస్ట్ సెంటర్ పిల్లర్ ఏఆర్ రెహమాన్ గారు. ఆయనలాంటి లెజెండ్‌తో పనిచేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. శివన్న గారిని స్క్రీన్‌పై చూస్తే ఓ ఫైర్‌లా అనిపిస్తుంది. 'జైలర్'లో ఆయన సీన్స్ చూస్తున్నప్పుడు చాలా




ఎంజాయ్ చేశాను. ఒక ఐకానిక్ పెర్ఫార్మెన్స్. ఆయన కళ్లే ఎన్నో ఎమోషన్స్ మాట్లాడతాయి. రత్నవేలు గారితో నేను నాలుగు సినిమాలు చేశాను. ఆయన ప్రతి ఫ్రేమ్ అద్భుతంగా ఉంటుంది. ఈ సినిమాకు ఆయన బిగ్గెస్ట్ అసెట్. దివ్యేందు రియల్ లైఫ్‌లో కూడా గ్యాంగ్‌స్టర్‌లా యాక్ట్ చేస్తుంటారు. దివ్యేందు, నేను ఒకే ఎత్తు ఉన్నా, సినిమాలో మా బాడీ లాంగ్వేజ్, ఆటిట్యూడ్ మాత్రం ఆరున్నర అడుగుల పైనే ఉంటాయి. జాన్వీ గారు ఈ సినిమాకు ఎంతో అందాన్ని తీసుకొచ్చారు. మా నిర్మాత సతీష్ కిలారు గారికి ధన్యవాదాలు. ఇది కష్టంతో చేసిన సినిమా కాదు, ఇష్టంతో చేసిన సినిమా. 'మగధీర', 'రంగస్థలం', 'ఆర్ఆర్ఆర్' చిత్రాలు చేస్తున్నప్పుడే అవి పెద్ద విజయాలు సాధిస్తాయని అనిపించింది. 'పెద్ది' విషయంలో కూడా నాకు అదే ఫీలింగ్ కలిగింది. ఇది చాలా స్ఫూర్తినిచ్చే సినిమా. నా కెరీర్‌లో జీవితాంతం దాచుకునే సినిమాల్లో ఇది ఒకటి. బుచ్చిబాబుకి, సుకుమార్ గారికి థాంక్యూ సో మచ్. 'పెద్ది' సినిమా ఇండస్ట్రీ గర్వపడేలా చేస్తుంది. ఇదొక బ్యూటీఫుల్ ఎంటర్‌టైనర్. ఇందులో ఒక మంచి సందేశం కూడా ఉంటుంది. ఈ సందర్భంగా సీఎం విజయ్ గారికి, తమిళనాడు ప్రజలకు నా శుభాకాంక్షలు తెలిజేస్తున్నాను. విజయ్ గారిని చూసి సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తిగా నేను ఎంతో గర్వపడుతున్నాను. పెద్ది చిత్రాన్ని ప్రతి ఒక్కరూ థియేటర్‌లో చూసి ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నాను. శివరాజ్ కుమార్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ సినిమాలో గౌర్నాయుడు లాంటి బలమైన పాత్ర ఇచ్చిన డైరెక్టర్ బుచ్చిబాబు గారికి ముందుగా థాంక్స్. రామ్ చరణ్ గారు, ఆయన కుటుంబం అంటే మాకు చాలా ఇష్టం. చరణ్‌తో కలిసి ఈ సినిమా చేయడం చాలా ఆనందంగా ఉంది. 'పెద్ది' జర్నీ ప్రేక్షకులను కదిలిస్తుంది. డైరెక్టర్ బుచ్చిబాబు ఈ కథను చాలా అద్భుతంగా రాశారు, తీశారు. రెహమాన్ గారు ఈ సినిమాకు అద్భుతమైన సంగీతాన్ని అందించారు. ఇంత మంచి టీమ్‌తో కలిసి పనిచేయడం ఆనందంగా ఉంది. నిర్మాత సతీష్ గారు ఎక్కడా రాజీ పడకుండా సినిమాను నిర్మించారు. రామ్ చరణ్ గారి పెర్ఫార్మెన్స్, ట్రాన్స్‌ఫర్మేషన్ అద్భుతంగా ఉంటాయి. జూన్ 4న ఈ సినిమా ఘన విజయం సాధిస్తుందని నమ్ముతున్నాను. మీలాగే నేను కూడా ఈ సినిమా కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. ఏఆర్ రెహమాన్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. చిరంజీవి గారు బిగ్గెస్ట్ స్టార్. ఆయన స్థాయిని అందుకోవడం అంత తేలిక కాదు. అయితే ఆయన కుమారుడిగా రామ్ చరణ్ కొత్త ప్రమాణాలను నెలకొల్పి అందరికీ స్ఫూర్తిగా నిలిచారు. తెలుగు సినిమా ఇండస్ట్రీ అంటే నాకు చాలా ఇష్టం. కీరవాణి గారు, దేవిశ్రీ ప్రసాద్ గారు, తమన్, మణిశర్మ గారు వంటి అద్భుతమైన సంగీత దర్శకులు ఉన్న పరిశ్రమలో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉంది. ఈ సినిమా కథను బుచ్చిబాబు గారు చెప్పినప్పుడు నాకు చాలా ఇన్‌స్పైరింగ్‌గా అనిపించింది. ఈ చిత్రానికి పని చేయడం ఎంతో ఎంజాయ్ చేశాను. తప్పకుండా ఈ సినిమా మీ అందరికీ నచ్చుతుంది. డైరెక్టర్ బుచ్చిబాబు సానా మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. చెన్నై అంటే నాకు చాలా ఇష్టం. నా ఫేవరెట్ పీపుల్ అందరూ ఇక్కడే ఉంటారు. ఇక్కడ అడుగుపెడితేనే సినిమా కనిపిస్తుంది. 'పెద్ది' మంచి ఎమోషనల్ డ్రామా. ఇది మిమ్మల్ని కట్టిపడేస్తుంది. చరణ్ సార్ పెర్ఫార్మెన్స్ చూసిన తర్వాత మీరు అంత తేలికగా మర్చిపోలేరు. నన్ను నమ్మినందుకు రామ్ చరణ్ గారికి థాంక్యూ సో మచ్. రెహమాన్ గారి గురించి నేను ఒక పుస్తకమే రాయగలను. ఆయనంటే నాకు అంత ఇష్టం. ఆయనతో కలిసి పని చేస్తానని నేను కలలో కూడా ఊహించలేదు. అది దేవుడి దయ వల్లే జరిగింది. రత్నవేలు గారు ఈ సినిమాను ఇంటర్నేషనల్ స్థాయిలో తీశారు. శివన్న గారు గురువు పాత్రలో అద్భుతంగా నటించారు. గురుశిష్యుల బంధం ఎలా ఉంటుందో ఈ సినిమాలో రామ్ చరణ్ గారు, శివన్న గారిని చూస్తే అర్థమవుతుంది. నిర్మాత సతీష్ గారికి ఎప్పటికీ రుణపడి ఉంటాను. అలాగే రామ్ చరణ్ గారిని కూడా జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేను.

## దాసరి నారాయణరావు గారు ఓ ఇన్‌స్టిట్యూషన్..

### ఆయన్ని చూసి చాలా విషయాలు నేర్చుకోవాలి: 'రా కింగ్' మనోజ్ మంచు

దిగ్గజ దర్శకుడు, దర్శక రత్న దాసరి నారాయణ రావు వర్ధంతి సందర్భంగా ఆయన ఘాట్‌ను హీరో రాకింగ్ మనోజ్ మంచు, తన సతీమణి భూమా మౌనికతో కలిసి సందర్శించారు. ఈ క్రమంలో దాసరి ఘాట్ దుస్థితిపై యాంకర్ గౌతమి షేర్ చేసిన వీడియోపై మనోజ్ రియాక్ట్ కావటమే కాకుండా స్వయంగా ఆ ప్రదేశాన్ని



సందర్శించి, శుభ్రపరిచే కార్యక్రమాలను ప్రారంభించారు. దాసరి పట్ల తనకున్న గౌరవాన్ని, ప్రేమను చాటుకున్నారు. ఈ సందర్భంగా... 'రా కింగ్' మనోజ్ మంచు మాట్లాడుతూ ''ఈరోజు మన గురువుగారు దాసరి నారాయణరావుగారి వర్ధంతి. నిజానికి ఈరోజు ఆయన వర్ధంతి అనే విషయం నాకు గుర్తు లేదు. నాలుగు రోజుల క్రితం చిత్రపురి కాలనీ వైపు వస్తుంటే, గురువుగారి విగ్రహం చూసి ఫ్యామిలీని గుర్తు చేసుకున్నాను. వెంటనే అరుణ్ అన్నకు ఫోన్ చేసి ఆలం అక్క నెంబర్ మారి పోయుంటే తీసుకున్నాను. వారితో మాట్లాడాను. ఎందుకనో దాసరిగారు గుర్తుకు వస్తున్నారని కూడా అన్నాను. ఈలోగా వేరే పనిలో పడి విషయం మరచిపోయాను. అది జరిగి నాలుగు రోజులు కూడా కాకముందే నిన్న సాయంత్రం గురువుగారు ఘాట్‌కు సంబంధించిన వీడియో చూడగానే చాలా బాధేసింది. వెంటనే స్పందించాను. నా టీమ్‌కు చెప్పాను. నేను ఆలస్యంగా చెప్పినా కూడా దార్లో వాళ్లు కార్మిక సిబ్బందిని మా కార్లలోనే ఎక్కించుకుని వచ్చాం. యాదగిరి అన్నకు ఫోన్ చేస్తే అన్న తెల్లవారు జామునే స్పందించారు. అలాగే ఎమ్మెల్యేగారు కూడా వెంటనే స్పందించారు. నేను కాల్ చేసిన ఇరవై నిమిషాల్లోనే స్పందించారు. జెసీబీని అరెంజ్ చేశారు. అన్నీ ఏర్పాట్లు చేశారు. 20–25 మంది పని చేశాం. నా మాట మీద ఇక్కడకు వచ్చిన వారందరికీ వసతులను ఏర్పాటు చేసిన అందరికీ థాంక్స్. గురువుగారి గురించి చెప్పాలంటే గొప్ప డైరెక్టర్..గొప్ప యాక్టర్.. గొప్ప స్క్రీన్ ప్లే రైటర్.. డైలాగ్స్, ఎడిటింగ్.. ఇలా 24 శాఖలపై ఆయన రాణించారు. ఆయన నా తండ్రి సమానులు. మా గురువుగారు. ఆయన్ని, పద్మ అంటీని ఎప్పుడూ మిస్ అవుతుంటాను. వాళ్లు లేని లోటు మాకు..ముఖ్యంగా నాకు బాగా తెలుస్తోంది. దాసరిగారి గురించి చెప్పాలంటే ఆయన డైరెక్షన్‌లో రూపొందిన నా మొగుడు నాకే సొంతం సినిమాలోయాక్ట్ చేశాను. అలాగే పుణ్యభూమి నాదేశం సినిమాలో ఆయనతో కలిసి నటించే భాగ్యం దక్కింది. మ్యూజిక్, ఎడిటింగ్ వర్క్స్ జరిగేటప్పుడు ఆయనతో పాటు వెళ్లేవాడిని. నాకు కూడా సినీ క్రాఫ్ట్ మీద ఇంత పిచ్చి, ఆసక్తి, ప్రాణం ఉందంటే మా నాన్నగారితో పాటు గురువుగారికే ఆ క్రెడిట్ దక్కుతుంది. గురువుగారు ఓ ఇన్‌స్టిట్యూట్. ఆయన మనకు ఓ దారి చూపించారు. ముఖ్యంగా ఆయన తీసిన సినిమాలు. సామాజిక సినిమాలు, కమర్షియల్ సినిమాలు, లేడీ ఓరియెంటెడ్ సినిమాలు చేశారు. దాసరిగారి పని అయిపోయిందని అనుకునే సమయంలో ఓ కొత్త రకమైన సినిమాతో మన ముందుకు వచ్చేవారు. కమర్షియల్, మేల్ డామినేషన్ ఉన్న సమయంలో విజయశాంతిగారితో ఒసేయ్ రాములమ్మ అనే సినిమా తీసి.. ప్రతీ హీరోకి భయం పుట్టించారు. ఆమెను కమర్షియల్ హీరో రేంజ్‌కు తీసుకొచ్చారు. ఆయన ఇచ్చిన సామాజిక సందేశాలు కానీ.. డ్రామా ఇలా ప్రతీ ఒక్కటి డిఫరెంట్. ఈరోజు మనం థియేటర్స్ సమస్యలంటూ మాట్లాడుకుంటున్నాం.ఇబ్బంది పడుతున్నాం. కానీ నాకు తెలిసి దాసరి నారాయణరావుగారు ఎప్పుడో దీనికి సంబంధించి మార్గం చూపించారు. ఆయన మూవీ మిషన్. ఒక సంవత్సరానికి పది నుంచి పదిహేను సినిమాలు చేసేవారు. ఎందుకలా చేస్తున్నారంటే.. ఓ సినిమా చేస్తే ఎంత మందికి ఎలా ఉపాధి కలుగుతుంది.. థియేటర్స్‌కు రెగ్యులారిటీ ఇవ్వకపోతే.. జనాలు థియేటర్స్‌కు వచ్చే అలవాటు తప్పుతుంది. ఎప్పుడో ఓ సినిమా చేయటం కాదు.. ఎప్పుడూ సినిమా చేయాలని చెప్పారు. నాతో పాటు నాతోటి హీరోలందరూ సినిమాలు చేయటానికి ఎంతో కష్టపడుతున్నారు. అందరం వీలైనన్ని ఎక్కువ సినిమాలు చేయాలి. ఆ బాధ్యత అందరిపై ఉంది. నా చేతుల మీద ఇలా జరగటం నా ఆశీస్సులుగా భావిస్తున్నాను. ఈ ఏడాది తిథి ప్రకారం చూస్తే ఆయన వర్ధంతి జూన్ 20న వచ్చింది. కాబట్టి ఆయన ఫ్యామిలీ మెంబర్స్ వెయిట్ చేస్తున్నారని తెలిసింది. ఇందులో ఎవరినీ తప్పు పట్టటానికి లేదు. నా దృష్టికి తీసుకొచ్చిన గౌతమిగారికి థాంక్స్. దాసరిగారున్నంత వరకు ఏ సమస్య ఉన్నా దాసరిగారు సమాధానంగా కనిపించారు. ఆయన తర్వాత ఆయనలా అన్నీ శాఖలపై పట్టున్నవారు అరుదయ్యారు. అందుకనే దాసరి గారు యుగానికి ఒక్కడనే చెప్పాలి. దాసరిగారిని చూసి మనం చాలా విషయాలు నేర్చుకోవాలి. దాసరిగారు, అంటీగారి ఇంట్లో ఎప్పుడూ మనుషులతో కోలహలం ఉండేది. దాసరిఘాట్‌ను పార్క్‌లా కాకుండా చుట్టు పక్కల పిల్లలు ఆడుకునేలా ఏదైనా యాక్టివేషన్ చేస్తే బావుంటుందని నా కోరిక. అది జరగాలని కోరుకుంటున్నారు. దాసరిగారు, పద్మగారిని ఎంతో మిస్ అవుతున్నాను. వారి ఆత్మలు ఎక్కడున్నా శాంతించాలని కోరుకుంటున్నాను'' అన్నారు. భూమా మౌనిక మంచు మాట్లాడుతూ ''ఈరోజు పెద్దలు దాసరి నారాయణరావుగారి వర్ధంతికి ఇక్కడకు వచ్చాం. పెద్దాయన ఆత్మ ఎక్కడున్నా శాంతి కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం. దాసరి గారంటే సినీ ఇండస్ట్రీకి, పబ్లిక్ సర్వీస్‌కు బాగా తెలిసిన వ్యక్తి. వారు తీసిన ఎన్నో సినిమాల్లో ఎన్నో సోషల్ మెసేజ్‌లు ఇచ్చారు. ఎంతో మందిని ఇన్‌స్పైర్ చేశారు. అసమానతలపై సినిమాలతో గొంతెత్తారు. ఆయన వర్ధంతికి ఇక్కడకు రావటం మా బాధ్యత. పెద్దాయన మనోజ్‌ను పిలిపించుకుని ఈ పని చేయించుకున్నారనిపిస్తోంది. మనోజ్‌గారు ప్రతీ సందర్భంలో దాసరి గారిని గుర్తు చేసుకుంటూ ఉంటారు. మనోజ్‌కు ఆయనెంతో ఇన్‌స్పిరేషన్‌గా నిలిచారు. వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాం'' అన్నారు.

## సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా 'పోలీస్ కంప్లైంట్' ట్రైలర్, స్పెషల్ సాంగ్స్ లాంచ్

టాలీవుడ్ సిల్వర్ స్క్రీన్‌పైకి హారర్ థ్రిల్లర్ అంశాలతో కూడిన అవుట్ అండ్ అవుట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ రాబోతోంది. ఎంఎస్‌కే ప్రమిద శ్రీ ఫిలిమ్స్ బ్యానర్‌పై బాలకృష్ణ మహారాణా నిర్మాణంలో, క్రియేటివ్ డైరెక్టర్ సంజీవ్ మేగోటి దర్శకత్వంలో రూపొందిన హారర్–యాక్షన్ థ్రిల్లర్ 'పోలీస్ కంప్లైంట్' మూవీ జూన్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ కార్యక్రమం హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో ఘనంగా



జరిగింది. ఈ సందర్భంగా చిత్ర ట్రైలర్‌తో పాటు రెండు ప్రత్యేక గీతాలను విడుదల చేశారు. అలాగే సూపర్ స్టార్ ఘట్టమనేని కృష్ణ జయంతిని పురస్కరించుకుని కేక్ కట్ చేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. సూపర్ స్టార్ కృష్ణ నటించిన పలు చిత్రాల టైటిళ్లను గుర్తు చేస్తూ రూపొందించిన ఈ సినిమాలోని ప్రత్యేక గీతాన్ని కృష్ణ అభిమానుల చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ పాటలో కృష్ణ వీరాభిమాని, నటుడు కృష్ణసాయి నటించడం విశేషం. కృష్ణసాయి, ప్రీతి సుందర్ ఈ గీతంలో కనిపించగా, రచన–సంగీతాన్ని దర్శకుడు సంజీవ్ మేగోటి అందించారు. అలాగే కృతి వర్మ స్పెషల్ అప్పియరెన్స్‌లో నటించిన "నువ్వట్టా సూత్తా ఉంటే" అనే మరో గీతాన్ని తెలంగాణ డీఐజీ రమణారెడ్డి విడుదల చేశారు. కార్యక్రమంలో తెలంగాణ డీఐజీ రమణారెడ్డి, నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్న కుమార్, సీనియర్ నిర్మాత ఆర్. సీతారామరాజు, సూపర్ స్టార్ కృష్ణ మేకప్‌మెన్ మాధవరావు, నిర్మాత ఘంటా శ్రీనివాసరావు, డిస్ట్రిబ్యూటర్ నరేంద్ర, పీఆర్ఓ శర్మ, డిస్ట్రిబ్యూటర్ సిరాజ్, ఆల్ ఇండియా కృష్ణ మహేష్ ప్రజాసేన జాతీయ అధ్యక్షులు ఖాదర్ గోరి, నటులు కృష్ణసాయి, కృతి వర్మ, ప్రీతి సుందర్ తదితరులు పాల్గొన్నారు. నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్న కుమార్ మాట్లాడుతూ, "సూపర్ స్టార్ కృష్ణ సినిమాల టైటిళ్లతో రూపొందించిన పాట అద్భుతంగా ఉంది. కృష్ణగారు గొప్ప వ్యక్తి. ఆయన బర్త్ డే సందర్భంగా ఈ వేడుక నిర్వంహించిన చిత్రయూనిట్‌కు అభినందనలు. తక్కువ బడ్జెట్‌లో అధిక నాణ్యతతో సినిమాలు రూపొందించే దర్శకుడు సంజీవ్ మేగోటి. ఈ చిత్రంలో ఆయన తన బహుముఖ ప్రజ్ఞను చాటుకున్నారు. సినిమా ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అన్నారు. డీఐజీ రమణారెడ్డి మాట్లాడుతూ, "ఈ సినిమాలో ప్రతి ఒక్కరూ అద్భుతంగా నటించారు. మంచి కాన్సెప్ట్‌తో సినిమా రూపొందించినట్టు తెలుస్తోంది. ఈ చిత్రం పెద్ద విజయాన్ని అందుకోవాలని ఆశిస్తున్నాను" అన్నారు. సూపర్ స్టార్ కృష్ణ మేకప్‌మెన్ మాధవరావు మాట్లాడుతూ, "కృష్ణగారు నాతో ఎంతో ఆత్మీయంగా ఉండేవారు. ఆయనపై ప్రత్యేక గీతాన్ని రూపొందించడం అభినందనీయం. కృష్ణగారి వీరాభిమాని కృష్ణసాయి ఈ పాటలో అద్భుతంగా నటించి ఆయనను గుర్తు చేశారు" అన్నారు. హీరో కృష్ణసాయి మాట్లాడుతూ, "ఈ సినిమా ఇండస్ట్రీలో పెద్ద హిట్ అవుతుందనే నమ్మకం ఉంది. దర్శకుడు సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. నా అభిమాన నటుడు సూపర్ స్టార్ కృష్ణగారి పుట్టినరోజు సందర్భంగా ఆయన సినిమాలను గుర్తు చేసే పాటలో నటించడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమాను ప్రతి ఒక్కరూ ఆదరించాలి. అందరిని మెప్పించే సినిమా ఇది" అన్నారు. దర్శకుడు సంజీవ్ మేగోటి మాట్లాడుతూ, "52 మంది సీనియర్ ఆర్టిస్టులతో కేవలం 45 రోజుల్లో ఈ సినిమాను పూర్తి చేశాం. 'చైన్ రియాక్షన్ ఆఫ్ కర్మ' అనే వైవిధ్యమైన కాన్సెప్ట్ చుట్టూ కథ తిరుగుతుంది. ఇది హారర్ థ్రిల్లర్ అంశాలతో కూడిన అవుట్ అండ్ అవుట్ యాక్షన్ ఎంటర్‌టైనర్. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుంది. అప్పట్లో సూపర్ స్టార్ కృష్ణగారితో సినిమా చేసే అవకాశం నాకు వచ్చింది. నేను చేసిన సినిమాలో నాలుగు పేజీల డైలాగ్‌ను ఒకే టేక్‌లో చెప్పిన గొప్ప నటుడు ఆయన. ఆయన పుట్టినరోజు సందర్భంగా ట్రైలర్ విడుదల చేయడం ఆనందంగా ఉంది" అని తెలిపారు. నటి కృతి వర్మ మాట్లాడుతూ, "నాకు ఈ అవకాశాన్ని ఇచ్చిన దర్శకుడికి ధన్యవాదాలు. సినిమా చాలా బాగా వచ్చింది. ప్రతి ఒక్కరూ సినిమా చూడాలి" అని అన్నారు. నటి ప్రీతి సుందర్ మాట్లాడుతూ, "తొమ్మిదేళ్లుగా నటిగా పలు ప్రాజెక్టుల్లో పనిచేశాను. ఈ చిత్రంలో ప్రత్యేక గీతంలో అవకాశం ఇచ్చిన దర్శకుడికి కృతజ్ఞతలు. సూపర్ స్టార్ కృష్ణగారిపై రూపొందించిన పాటలో భాగమవడం చాలా సంతోషంగా ఉంది" అని పేర్కొన్నారు. హారర్, యాక్షన్, కామెడీ, రొమాన్స్, థ్రిల్లర్ అంశాల సమ్మేళనంగా రూపొందిన 'పోలీస్ కంప్లైంట్' చిత్రం జూన్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, ప్రత్యేక గీతాలు సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచుతున్నాయి.

## ప్రముఖ నిర్మాత అశోక్ కుమార్ అతిథిగా పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైన "సాV3" మూవీ...

సామ్రాట్, డీమోన్ పవన్, లిఖిత (రాను బొంబాయికి రాను సాంగ్ ఫేమ్) హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా "సాV3". ఈ చిత్రాన్ని లక్ష్మి కృష్ణ ఫిలింస్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం.2గా నిర్మాత వి. విజయ నిర్మిస్తున్నారు. నటుడు, దర్శకుడు కృష్ణ మాయ ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఈ రోజు పూజా కార్యక్రమాలతో "సాV3" సినిమా ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ప్రముఖ నిర్మాత అశోక్ కుమార్ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథిగా వచ్చిన నిర్మాత అశోక్ కుమార్ మాట్లాడుతూ – కృష్ణమాయ సినిమా మీద ప్యాషన్ ఉన్న వ్యక్తి. ఆర్ట్ డైరెక్టర్, నటుడు, రైటర్..ఇలా బహుముఖ ప్రజ్ఞాశాలి. ఇతను నాకు ప్రేమించుకుందాం రా టైమ్ నుంచి తెలుసు. మా ఈశ్వర్ మూవీలో కూడా ఒక క్యారెక్టర్ చేశాడు. ఎప్పుడూ సినిమా గురించే ఆలోచిస్తుంటాడు. సినిమాలు రిస్క్



వద్దని నేను ఎన్నోసార్లు చెప్పాను. అయినా తనకున్న ప్యాషన్ తో మూవీస్ చేస్తున్నాడు. ఇప్పుడు ఇండస్ట్రీ కొంత స్లంప్ లో ఉంది. మంచి కంటెంట్ ఉంటే ప్రేక్షకులు ఆదరిస్తారు. థియేటర్స్ కు వచ్చేది యూత్ కాబట్టి కృష్ణమాయ మంచి యూత్ ఫుల్ మూవీ చేస్తున్నాడు. ఒక ప్లాన్ ప్రకారం సినిమా చేసుకోవడం నా దగ్గర నుంచే నేర్చుకున్నాని చెబుతుంటాడు. ఈ సినిమాను కూడా అలాగే ప్లాన్డ్ గా రూపొందించి కంప్లీట్ చేశాడు. ఈ సినిమా మంచి విజయం సాధించి కృష్ణమాయ మరిన్ని చిత్రాలు చేసే సపోర్ట్ ఇవ్వాలని కోరుకుంటున్నా. అన్నారు. దర్శకుడు కృష్ణమాయ మాట్లాడుతూ – మా లక్ష్మి కృష్ణ బ్యానర్ పై గతంలో రైల్వే స్టేషన్ అనే చిత్రాన్ని రూపొందించాం. ఇప్పుడు ఈ బ్యానర్ లో చేస్తున్న రెండో సినిమా "సాV3". ఈ టైటిల్ ఇలా పెట్టేందుకు ఓ కారణం ఉంది. సా అంటే సావిత్రి హీరోయిన్ పేరు. అలాగే వి అంటే విజయ్ కుమార్ అంటే డీమోన్ పవన్ పేరుంది. 3లో త్రివిక్రమ్ రాజు అంటే సామ్రాట్ చేస్తున్న క్యారెక్టర్. "సాV3" సినిమాను కంప్లీట్ చేశాక పూజా కార్యక్రమాలు చేస్తున్నాం. ఎందుకంటే ఈ పూజా కార్యక్రమాలకు కూడా ఖర్చు పెట్టగలమో లేదో అని ముందే నిర్వహించలేదు. సినిమా అంతే కంప్లీట్ చేసుకుని, డబ్బింగ్ కంప్లీట్ చేసుకుని ఎడిటింగ్ చేస్తున్న టైమ్ లో హ్యాపీగా ఈ పూజా కార్యక్రమాలు పెట్టుకున్నాం. ఇదొక వెరైటీ అనుకోవచ్చు. ప్రొడక్షన్ ఖర్చుపరంగా సేఫ్ గా వెళ్తున్నామని అనుకోవచ్చు. లిఖి, డీమోన్ పవన్ కొత్త వాళ్లు ఎలా నటిస్తారో అనుకున్నాను గానీ పర్ ఫార్మెన్స్ ఇరగదీశారు. వాళ్లకు ఇప్పటిదాకా సరైన మూవీ రాలేదని అనిపించింది. సాయి కార్తీక్ మ్యూజిక్ హైలైట్ గా నిలుస్తుంది. మా టెక్నీషియన్స్ అందరూ అద్భుతమైన ఔట్ పుట్ ఇచ్చారు. "సాV3" సినిమా ఖచ్చితంగా విజయం సాధిస్తుందని నమ్మకంతో ఉన్నాం. అన్నారు. హీరో సామ్రాట్ మాట్లాడుతూ – నేను బిజినెస్ పనుల్లో పడి ఈ మధ్య ఇండస్ట్రీకి కాస్త దూరంగా ఉంటున్నాను. ఇటీవల ఓ ప్రైవేట్ సాంగ్ చేశాను. ఆ సాంగ్ షూట్ టైమ్ లో డైరెక్టర్ కృష్ణమాయ గారు కలిసి ఈ స్క్రిప్ట్ చెప్పారు. బ్యూటిఫుల్ స్క్రిప్ట్ ఇది. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో మూవీ సాగుతుంది. రియల్ ఇన్సిడెంట్స్ బేస్ చేసుకుని చేస్తున్న చిత్రమిది. షూటింగ్ కంప్లీట్ చేశా. చాలా ప్లాన్డ్ గా, ఫాస్ట్ గా షూటింగ్ పూర్తి చేశాం. లిఖిత ఈ సినిమాలో మరింత అందంగా కనిపిస్తుంది. నేను 19 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు సమ్ థింగ్ సమ్ థింగ్ అనే మూవీ చేశాను. అప్పటి నుంచి ఇప్పటిదాకా ఇలాంటి మంచి క్యారెక్టర్ నాకు దొరకలేదు. ఇలాంటి డైరెక్టర్ దొరకలేదు. ఈ చిత్రంతో ఒక కొత్త సామ్రాట్ ను ప్రేక్షకులు చూస్తారు. మా డైరెక్టర్ మా దగ్గర నుంచి తనకు కావాల్సిన పర్ ఫార్మెన్స్ తీసుకున్నారు. హీరో డీమోన్ పవన్ మాట్లాడుతూ – బిగ్ బాస్ తర్వాత నేను ఎలాంటి మూవీ చేయాలని ఆలోచిస్తున్న టైమ్ లో డైరెక్టర్ కృష్ణ మాయ గారు ఈ స్క్రిప్ట్ చెప్పారు.


Published ,printed and owend by Sudheer Kumar Katepally printed at Sree sesha Sai enterprises , plot no .98/part 1,co-operative industrial estate phase-II, Gandhi nagar Hyderabad,Medchal Malkajgiri , Telangana-500037. Published at 6-3-553,Flat no .G2, CLassic Court Ane A, opp:NKM Grand hotel, Erramanzil Colony, Somajiguda, Hyderabad, Telangana-500082.Editor : Sudheer kumar katepally ph: 9000657700 PRGI NO: TGTEL/26/A2380